విశాలాంధ్ర

నాపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

టీడీపీ కడప నగర అధ్యక్షులు సాన్నపురెడ్డి శివకొండ రెడ్డి డిమాండ్

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : నాపై కర్రలతో దాడి చేసి తలకు బలమైన గాయం పరిచిన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని తెలుగుదేశం పార్టీ కడప నగర అధ్యక్షులు సాన్నపురెడ్డి శివకొండ రెడ్డి అన్నారు. శనివారం సంఘటన స్థలంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ. ఇంటి దగ్గర నుండి స్కూటీలో పాలకొరకు రోడ్డుమీదికి వచ్చిన నన్ను ముగ్గురు గుర్తు తెలియని యువకులు స్కూటర్ల పై వచ్చి నాపై కర్రలతో దాడి చేసి తలపైన బలంగా కొట్టారని తెలిపారు. నాపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు. రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉండగా తెలుగుదేశం పార్టీ మా పైనే దాడులు జరగడం దురదృష్టకరమన్నారు. ఈ దాడి ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ లు స్పందించి ఇటువంటి దుర్ఘటనలు మళ్లీ జరగకుండా చూడాలని ఆయన కోరారు.

స్త్రీనిధి సొమ్ము స్వాహాపై విచారణ..!

రూ.10 లక్షలు బకాయిలపై ఆరా.
రికవరీ జరగకపోతే చట్టపరమైన చర్యలు.
స్త్రీనిధి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఉదయ్ కుమార్

విశాలాంధ్ర-గాలివీడు: స్త్రీనిధి సొమ్ము స్వాహాపై విచారణ అధికారి స్త్రీనిధి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఉదయ్ కుమార్ శనివారం ఎగువగొట్టివీడు గ్రామం గొల్లపల్లెలో విచారణ జరిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గాలివీడు మండలంలో మొత్తం రూ.10 లక్షల వరకూ బకాయిలు ఉండగా అందులో అత్యధికంగా గొట్టివీడు గ్రామంలోని గొల్లపల్లెలో స్త్రీనిధి సొమ్ము రూ.4.15 లక్షల బకాయిలు ఉన్నాయన్నారు.ఇదే విషయమై మహిళా సంఘాల సభ్యులను విచారించగా ఇప్పటికే చాలావరకు బకాయిలు చెల్లించామని, అయినప్పటికీ ఎక్కువ మొత్తంలో అప్పు చూపిస్తున్నట్లుగా ఆరోపిస్తున్నారన్నారు. అయితే అవి బకాయిలా? లేక వెలుగు సిబ్బంది చేతివాటంతో నిలిచి పోయిన అప్పా? అనే విషయం క్షేత్రస్థాయిలో రసీదులు, బుక్కులు క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉందన్నారు. ఇకపోతే మండలంలో గుండ్లచెరువు రూ. 80,900 , సీసీ పల్లె రూ.65000, తూముకుంట రూ.29,500 ,అరవీడు రూ.32000

2

రాయచోటిలో దోమల దండయాత్ర

- పుడుతున్నాయి... కుడుతున్నాయి..
- వ్యాధుల బారిన పడుతున్న ప్రజలు

విశాలాంధ్ర-రాయచోటి: రాయచోటి పట్టణంలో చీకటి పడితే దోమల దండయాత్ర ప్రారంభమై ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. మున్సిపల్ అధికారులు శానిటరీ అధికారులు ఫాగింగ్ చేకపోవడం దీంతో దోమలు పెరిగి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. వైద్యశాఖ అధికారులు వేదలపై అప్రమత్తంగా ఉండాలని పదేపదే చెబుతున్న ఇక్కడ అధికారులు మాత్రం నెమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. రాయచోటి పట్టణం దినదినాభివృద్ధి చెందుతూ పట్టణం విస్తరిస్తుంది జనాభా పెరుగుతుంది. అయితే మున్సిపాలిటీ నుంచి గ్రేడ్ వన్ మున్సిపాలిటీ అయింది. అలాగే అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిగా అవతరించింది. దీంతో రాయచోటి రూపురేఖలు మారిపోతాయని ప్రజలు భావించారు. జిల్లా అధికార యంత్రాంగం రాయచోటి పట్టణంలో ఉన్న ప్రజలకు ఎలాంటి సౌకర్యాలు ఏర్పాటు కావడం లేదు. దాదాపు జిల్లా ఏర్పాటయి రెండున్నర సంవత్సరాలు కాలం అయింది. పారిశుద్ధ్యం, డ్రైనేజ్, నీటి సౌకర్యం విషయంలో ఆశించిన ఫలితం శూన్యం. పట్టణంలో ఎక్కడ చూసినా ఖాళీ ప్రదేశాల్లో చెత్తా చెదారం, మురుగునీరు గుట్టలు గుట్టలుగా పడి ఉంది. మున్సిపల్ అధికారులు మాత్రం ఇళ్ల నుంచి చెత్తను సేకరించడం తప్ప ఖాళీ ప్రదేశాల్లో ఉన్న గుట్టల గుట్టల చెత్త విషయంలో పట్టించుకోకపోవడం, ప్రదేశాలు విపరీతంగా పిచ్చి మొక్కలు పెరగడం సర్పాలు చేరుకోవడం కుళ్ళిన చెత్తలో దోమల అభివృద్ధి చెందడం చీకటి పడితే చాలు రోడ్లపై నిలబడిన ముసురుకుని ఒక్క నిమిషం కూడా నిలబడలేని పరిస్థితులు కల్పిస్తున్నాయంటే పరిస్థితి తీవ్రత అర్థం చేసుకోవచ్చు. దోమల దండయాత్ర చేస్తున్న ప్రజాప్రతినిధులుగా ఉన్న కౌన్సిలర్లు వారి వార్డుల్లో దోమల నివారణ చర్యలు చేపట్టడంలో విఫలమయ్యారు. మలేరియా అధికారులను తాము ఎప్పుడూ చూడలేదని ప్రజలు ఆయన ఎక్కడ ఉంటారో కూడా తమకు తెలియదని ప్రజలు చెబుతున్నారు.

పాగింగ్‌తోనే దోమల నివారణ

రాయచోటి పట్టణంలో ప్రతి మున్సిపల్ వార్డులో దోమల నివారణకు ఫాగింగ్ కార్యక్రమాలు చేపడితే దోమల నివారణ సాధ్యమవుతుంది. ప్రస్తుతం దోమలు పట్టణంలో దండయాత్ర చేయడంతో ప్రజలు మలేరియా డెంగ్యూ టైఫాయిడ్

2

మైనర్ బాలికకు నిప్పు పెట్టిన ప్రేమోన్మాది

80 శాతం కాలిన గాయలతో పరిస్థితి విషమం
4 ప్రత్యేక బృందాలు నియమించి గాలింపు చర్యలు
కడప జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు వెల్లడి

విశాలాంధ్ర కడప జిల్లా బ్యూరో/ బద్వేలు :

ఓ యువకుడు ప్రేమించిన మైనర్ బాలికను అడ్డు తొలగించుకునేందుకు పథకం ప్రకారం నిప్పుపెట్టి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన వైయస్సార్ జిల్లా గోపవరం మండలం పిపి కుంట సమీపంలోని సెంచురీ ప్లై వుడ్ కంపెనీ సమీపంలోని అటవీ ప్రాంతంలో చోటు చేసుకొంది.

(వివరాలు మెయిన్‌లో)

నిందితుల కోసం గాలింపు ముమ్మరం

విశాలాంధ్ర- బద్వేలు : గోపవరం సమీపంలో ఇంటర్ విద్యార్థినిపై విగ్నేష్ అనే యువకుడు పెట్రోలు పోసి దాడి చేసిన విషయం తెలిసిందే, ఈ ఘటనపై జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు సీరియస్ అయ్యారు. సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని పరిస్థితిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ విద్యార్థినికి 80% గాయాలయ్యాయని తెలిపారు. చిన్నప్పుడు నుండి యువకుడు విగ్నేష్ విద్యార్థినికి పరిచయం ఉందని తెలిపారు .ఇద్దరు బద్వేల్ రామాంజనేయ నగర్ కు చెందిన వారిని వెల్లడించారు. నాలుగు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేస్తున్నామని తెలియజేశారు. నిందితుని త్వరలో అరెస్టు చేసి వాస్తవాలను వెలికిస్తామన్నారు.

పోలీసు అమర వీరుల వారోత్సవాలు విజయవంతం చేయండి - జిల్లా ఎస్పీ

విశాలాంధ్ర-రాయచోటి: అన్నమయ్య జిల్లాలో ఈనెల 21 నుండి 31వ తేదీ వరకు పోలీసు అమర వీరుల వారోత్సవాలను ఘనంగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు విద్యాసాగర్ నాయుడు తెలిపారు. ఈనెల 21 నుండి పోలీస్ అమరవీరుల వారోత్సవాలు ప్రారంభం కానున్నాయి. అమరులైన పోలీసులను స్మరించుకుంటూ వారి సేవలను కొనియాడుతూ ఈ వారోత్సవాలను ఘనంగా నిర్వహించేలా జిల్లా పోలీసు యంత్రాంగం సిద్ధమయ్యింది. జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో ఈనెల 21 వ తేదీ నుండీ 31 వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్ల పరిధుల్లో ఈ వారోత్సవాలు నిర్వహించనున్నారు. విధి నిర్వహణలో అసువులు బాసిన అమర పోలీసుల్ని గుర్తు చేసుకోవడంతో పాటు సమాజంలో కీలకమైన పోలీసుల పాత్ర, విధులు, త్యాగాలు గురించి ప్రజల్లో అవగాహన తీసుకురావడమే ముఖ్య ఉద్దేశ్యం. 1959వ సంవత్సరం, అక్టోబర్ 21వ తేదీన దేశ భద్రత కోసం పదిమంది సీఆర్‌పీఎఫ్ జవాన్‌లు భారత్, చైనా సరిహద్దుల్లో ఉన్న లడక్ ఆక్సాయ్‌చిన్ వద్ద విధులు నిర్వహిస్తున్నారు. ఈ ఘటన పురస్కరించుకుని ప్రతీ ఏటా అక్టోబర్ 21వ తేదీ పోలీసుల అమర వీరుల సంస్మరణ దినంగా పాటిస్తున్నారు. 21 న స్థానిక పోలీసు అమర వీరుల స్థూపం వద్ద జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో పోలీసు అమర వీరుల సంస్మరణ దినం నిర్వహించనున్నారు. 22 నుండి 30 వ తేదీ వరకు పోలీసు అమరుల గ్రామాలు పట్టణాలు సందర్శించనున్నారు. 24 నుండి 27 వరకు చర్చావేదికలు, వక్తృత్వపు పోటీలు. 26న పోలీసుల త్యాగాలు, పరాక్రమాలు తెలియజేసే చిత్రాల ప్రదర్శనలు, 26 నుండి 27 వరకు ఓపెన్ హౌస్‌లు నిర్వహణ. 28న వైద్య శిభిరాలు, రక్తదానాలు ఉంటాయన్నారు. ఈనెల 29వ తేదీన పోలీసుల త్యాగాలపై సెమినార్లు/ ఉపన్యాసాలు... సాంస్కృతిక కార్యక్రమాలు. ఈనెల 30న పోలీసు అమరుల కుటుంబాల్లోని ప్రత్యేక సాధకులను గుర్తించి వారికి సన్మానం చేయడం, వారి సేవలను ప్రశంసించనున్నారు. 31న సమైక్యతా దినం పాటించడం జరుగుతుంది. 31వ తేదీన ఉదయం యూనిటీ రన్, సాయంత్రం క్యాండిల్ ర్యాలీతో పోలీసు అమర వీరుల వారోత్సవాలు ముగింపు జరుగుతుందన్నారు.

సాంకేతిక విద్యతోనే ఉపాధి అవకాశాలు

విశాలాంధ్ర-వేంపల్లి: సాంకేతిక విద్యా ద్వారా ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయాని తహశీల్దార్ హరినాథ్ రెడ్డి, ఐటిఐ ప్రిన్సిపాల్ ప్రసాద్ రావులు పేర్కొన్నారు. శనివారం స్థానిక కందుల ఓబుల్ రెడ్డి చారిటీస్ ఐటిఐలో విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ తక్కువ వ్యవధిలోనే నైపుణ్యం పెంపొందించుకొని ఉపాధి పొందడానికి పారిశ్రామిక శిక్షణ సంస్థలు దారి చూపుతాయాని చెప్పారు. ఐటిఐ శిక్షణ పూర్తి చేసిన వారికి ఎక్కువగా పరిశ్రమలు ఉత్పాదక తయారి సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు ఉంటాయాని చెప్పారు. సాంకేతిక పోస్టుల్లో సింహభాగం సంబంధిత ట్రేడుల్లో ఐటిఐ చదువుతున్న వారితోనే భర్తీ చేస్తున్నట్లు చెప్పారు. ఐటిఐ పూర్తి చేసిన యువతకు రైల్వేలు, సైన్యం, నౌకాదళం, వైమానిక దళం, నీటి పారుదల, వృతి విద్య విభాగం సాంకేతిక విభాగంకు చెందిన ప్రభుత్వ రంగాల్లో ఉపాధి అవకాశాలు ఉంటాయని చెప్పారు. అనంతరం సిఐ సురేష్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లు దూరంగా ఉండాలని కోరారు. గంజాయి లాంటి వాటికి కూడ యవత దూరంగా ఉండాలని చెప్పారు. వాహనాలు నడిపే సమయంలో కూడ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తును నాశనం చేసుకోకుండా మంచి మార్గంలో నడవాలని కోరారు. అనంతరం ఐటిఐ విద్యా పూర్తి చేసిన విద్యార్థులకు తాహసిల్దారు హరినాథ్ రెడ్డి, సిఐ సురేష్ రెడ్డిలు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో చక్రాయపేట ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ రాధాకృష్ణ, పంచాయతీ కార్యదర్శి నాగభూషణం రెడ్డి, ఐటిఐ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దోమల దండయాత్ర

(మొదటి పేజీ తరువాయి)

జ్వరాలకు గురవుతున్నారు. పేద మధ్యతరగతి ప్రజలు ఈ వ్యాధులు నివారణకు ఆసుపత్రులకే వేల రూపాయలు వెచ్చించాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. ప్రజల ప్రాణాల రక్షణ విషయంలో అధికారులు ఎందుకు ఇంత నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం కావడం లేదు. పట్టణంలో అక్కడక్కడ డ్రైనేజ్ మురికి నీటితో గుంతలు నుండి నీరు నిలిచిపోవడంతో దోమలువిజృంభిస్తున్నాయని పట్టణ ప్రజల వాపోతున్నారు. అధికారులు ప్రజల ప్రాణాలతో చెలగాట మాడకుండా నీరు నిల్వ ఉండడం దీనివల్ల దీనివల్ల దుర్వా సన వెదజల్లడంతో దోమలు అధికంగా వ్యాపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు అక్కడక్కడ వర్షపు నీరు నిలబడి కాలే ప్రదేశాల్లో చెత్తాచెదారం కుళ్ళి దోమలు పుడుతున్నాయి ప్రజలను కొడుతున్నాయి. ఇక్కడ ప్రజలకు డెంగ్యూ జ్వరా లు రావడం బెంగళూరు, తిరుపతి ప్రవేట్ ఆసుపత్రులకు పరుగులు తీయడం లక్షల రూపాయలు ఆసుపత్రులకు చెల్లించడం పేద మధ్యతరగతి ప్రజలు అప్పులు పాలవు తున్నారు. కూటమి ప్రభుత్వం దోమల నివారణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పల్లెల్లో లోపించిన పారిశుధ్యం

ఇటీవల కురిసిన వర్షాలకు పల్లెల్లో పారిశుధ్యం లోపిం చింది. వర్షాలకు అక్కడక్కడ రొచ్చు రొచ్చుగా మారాయి. పంచాయతీల్లో కనీసం బ్లీచింగ్ కూడా చల్లడం లేదు. వర్షాలకు నిత్యం ప్రజలు వినియోగించే మంచినీటి వన రులు కూడా కలుషితం అవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల చుట్టూ చెత్తాచెదారం అధికంగా ఉండడం కాలవలు పూడిపోయి వర్షపు నీరు నిలవడం ఆ నీటిలో దోమలు అభివృద్ధి చెందుతున్నాయి.

ప్రబలుతున్న విష జ్వరాలు అంటువ్యాధులు

గ్రామీణ ప్రాంతాలలో ఇటీవల వర్షాలకు దోమలు ఒకవైపు కలుషితమైన నీరు వల్ల ప్రజలు విష జ్వరాలకు గురవుతు న్నారు. ఈ జ్వరాలు ప్రజలకు ప్రాణాంతకంగా మారు తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో చాలామంది ఆర్ఎంపీల వద్ద చికిత్స పొందుతున్నారు. ప్రవేట్ ఆసుపత్రులవారు రక్త పరీక్షల పేరుతో స్కానింగ్ పేరుతో వేలాది రూపాయలు పేద ప్రజల నుంచి గుంజుకుంటున్నారు. ప్రధాన కారణం దోమలు, పారిశుధ్యంలోపించడమే. గ్రామ సర్పంచులు, అధికారులు కూడా దోమల నివారణకు నిధులు సాకుతో తప్పించుకుంటున్నారు.

స్త్రీనిధి సొమ్ము స్వాహాపై విచారణ..!

(మొదటి పేజీ తరువాయి)

బకాయిలు ఉన్నాయన్నారు.శనివారం జరిగిన విచారణలో రూ.1,20,000 రికవరీ కాగా అందులో గుండ్లచెరువు నుండి రూ. 30000, నూలివీడు రూ.75000, పూలు కుంట రూ.15000 వున్నట్లుగా తెలిపారు.ఏది ఏమైనప్ప టికీ విచారణ అధికారులు పారదర్శకంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి స్వాహా అయిన స్త్రీనిధి సొమ్మును రికవరీ చేసి అందుకు కారకులైన వారిపైనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.ఈకార్యక్రమంలో స్త్రీనిధి మేనేజర్ మౌనిక,లీగల్ కోఆర్డినేటర్ శ్రీనువాసులు, ఏపీఎం పెద్ద రెడ్డయ్య,సీసీలు,యానిమేటర్లు పాల్గొన్నారు.

స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-వేంపల్లి: యుటియఫ్ భవన్‌లో ఆదివారం జరగనున్న యుటిఎఫ్ స్వర్ణోత్సవ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి చెరుకూరు శ్రీనివాసులు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు పిలుపు నిచ్చారు. శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాము లూరులో జిల్లా మహాసభల కరపత్రాలను ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు మరియు యుటిఎఫ్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యుటి ఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో స్వర్ణోత్సవ మహాసభలను జిల్లాలో ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. స్వర్ణోత్సవ మహాసభలను పురస్కరించుకొని జిల్లాలో ఇప్పటికే పలు క్రీడా, సాంస్కృతిక పోటీలను నిర్వహించామని తెలిపారు. ఈ మహాసభలలో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై చర్చించి, సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్ పోరాట కర్తవ్యాలను రూపొందించనున్నామని పేర్కొన్నారు. పాలకవర్గాలు ప్రభుత్వ విద్యారంగం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, అందులో భాగంగానే ప్రాథమిక విద్యను నిర్వీర్యపరుస్తూ విద్యను ప్రైవేటీకరించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వాలు మారుతున్నా, పాలకులు మారుతున్నా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. ఎన్నికలకు ముందు పాలకులు ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై హామీలు ఇస్తున్నారు తప్ప పరిష్కారంలో చిత్తశుద్ధి చూపడం లేదని విమర్శించారు. వీటిపై చర్చించి సమస్యల సాధన కోసం, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం భవిష్యత్తులో పోరాటాలు నిర్మించేందుకు ఈ మహాసభలను వేదికగా చేసుకోబోతున్నామన్నారు. ఈ సభలకు జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతోటి, జిల్లా విద్యాశాఖాధికారి ఎం.అనురాధ, యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ఎస్ ఎస్ ప్రసాద్ లు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారని వారు వివరించారు. ఈ మహాసభలకు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కౌన్సిలర్ కృష్ణారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సి.శ్రీనివాసులు , పాఠశాల హెడ్ మాస్టర్ సు బ్బారెడ్డి, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, మేరీ, గుప్తా తదితరులు పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలకు సై.. డాక్టర్ కుంచం

విశాలాంధ్ర-తొండూరు: జమిలి ఎన్నికలు ఎప్పుడొచ్చినా తాము సై అని రాయలసీమ రాష్ట్ర సమితి జాతీయ అధ్య క్షులు డాక్టర్ కుంచం వెల్లడించారు. రాయ లసీమ నుంచి తమ పార్టీ తరుపున అన్ని స్థానా లకు పోటీ చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ఆలోచన ప్రకారం దేశవ్యాప్తంగా జమిలి ఎన్నికలు నిర్వహించాల్సి వస్తే అందుకు తాము సంసిద్ధమేనన్నారు. తొలి ప్రాధాన్యతగా ప్రత్యేక రాష్ట్రం ఆ తర్వాత కేంద్ర పాలిత ప్రాంతం రెండో డిమాండ్‌తో ఎన్నికల బరిలో దిగుతామన్నారు. ఈ రెండింటిని మించి తాము కోరేదేదిలేదన్నారు. దశాబ్దకాలంగా ప్రత్యేక రాయలసీమ కోసం ఉద్యమాలు నిర్వహిస్తున్నామన్నారు. రాయలసీమ ప్రజల ఆకాంక్ష మేరకు తాను చేపట్టిన ఈ ఉద్యమాలకు రాయలసీమ అంతటా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు మద్దతుగా నిలిచాయన్నారు. ఈ విషయమై తాను గతంలో ప్రధాని మోదీకి అనేక మార్లు విన్నవించానని, లేఖలు కూడా రాశానని తెలిపారు. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రత్యేక రాయలసీమ గురించి చీమకుట్టినట్లుగా లేకపోడం దారుణమన్నారు. ఇక తాడాపేడో తేల్చుకోవాల్సిన సమయం కూడా ఆసన్నమైందన్నారు. ఇక ఉద్యమానికి సరికొత్త నిర్వచనం చెప్పేందుకు సిద్దంగా ఉన్నానన్నారు. ఇప్పటికైనా ప్రధాని మనసు మార్చుకుని తమ విన్నపాన్ని గౌరవించి ఆర్టికల్ -3 ప్రకారం ప్రత్యేక రాయలసీమ ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. లేదంటే గల్లీ నుంచి ఢిల్లీ దాకా రాయలసీమ కేక వినిపిస్తానన్నారు. ఢిల్లీ పెద్దలకు కనువిప్పు కలిగేలా ఉద్యమ రూపకల్పం చేస్తున్నామన్నారు. ఉద్యమాలు ఉవ్వెత్తున ఎగిసి పడక ముందే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మేల్కొనాల్సిన అవసరం ఎంతైనా ఉందని హెచ్చరించారు.

దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుల అరెస్ట్

విశాలాంధ్ర-రాయచోటి: అన్నమయ్య జిల్లా పరిధిలో పలు దొంగత నాలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగలు ఇద్దరిని అరెస్టు చేసినట్లు డిఎస్‌పి కృష్ణమోహన్ తెలిపారు. వారి వద్ద నుంచి 6 లక్షలు విలువ చేసే 86.500 గ్రాములు బంగారు రికవరీ చేయడం జరిగిందన్నారు. నింది తులు నెల్లూరు జిల్లాకు చెందిన వారుగా డీఎస్పీ తెలిపారు. అరెస్ట్ అయిన వారిపై వివిధ కేసులు ఉన్నట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు.

తుపానుతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

విశాలాంధ్ర-రాయచోటి: అన్నమయ్య జిల్లాలో ఇటీవల తుఫాను ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నమయ్య జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి కోరారు. రాయచోటి పట్టణం రైతు సంఘం కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైల్వే కోడూరు, రాజంపేట, రాయచోటి, పీలేరు, మదనపల్లె నియోజకవర్గాలలో తుఫాను ప్రభావంతో అరటి బొప్పాయి టమాటా మునగ పంటలు ఈదురు గాలులు వర్షానికి బాగా దెబ్బతిన్నాయన్నారు. వ్యవసాయ అధికారులు పం టలు దెబ్బతిన్న ప్రాంతాలను సందర్శించి నష్టపోయిన రైతుల జాబితాను తయారుచేసి ప్రభుత్వానికి సమర్పించాలని ఆయన కోరారు. అలాగే ఉపాధి హామీ పథకాన్ని వ్యవసా యానికి అనుసంధానం చేయాలని, రైతులకు సబ్సిడీతో ఎరువులు విత్తనాలు స్ప్రింక్లర్లు డ్రిప్ ఇరిగేషన్ మంజూరు చేయాలని కోరారు. విత్తనాలు ఎరువులు మార్కెట్లలో నకిలీవి చలామణి అవుతున్నాయని అధికారులు వాటిని అరికట్టాలని రంగారెడ్డి కోరారు.

కూలిన పాఠశాల గోడ ..పరిశీలించిన టిడిపి ఇన్చార్జి జయ చంద్రారెడ్డి

విశాలాంధ్ర-బి.కొత్తకోట: నగర పంచాయతీ పరిధిలోని ,ఆలేటిపల్లి, ప్రాథమిక ఉన్నత పాఠశాల ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రెండు తరగతి గదులు ఉన్న పాఠశాలలో ఒక తరగతి గది యొక్క ఒక వైపు గోడ కూలిపోయినది, విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ నాయకులు తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్చార్జి దాసరపల్లి జయచంద్ర రెడ్డి శనివారం ఆలేటి పల్లి పాఠశాలకు దగ్గరికి వెళ్లి పరిశీలించారు పాత భవనం గురించి వాటి స్థితిగతులు గురించి ప్రధానోపాధ్యాయులను ఎంఈఓ ని అడిగి తెలుసుకున్నారు అనంతరంతరగతి గది యొక్క పరిస్థితి చూసి శిథిలావస్థకు చేరుకున్న గదికి దూరంగా పిల్లలను ఉంచాలని, విద్యార్థులను సురక్షితంగా నూతన గదిలోనే ఉంచాలని, ఉపాధ్యాయులకు సూచించారు. నిబంధనల మేరకు శిథిలావస్థలో ఉన్న గదిని తొలగించాలని మండల అధికారులకు తెలియజేశారు. అనంతరం అక్కడనుండి జిల్లా కలెక్టర్ ని చార్వాణి ద్వారా మాట్లాడి పాఠశాల భవనం ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా దెబ్బతిని కూలిపోయిందని శిథిలా వ్యవస్థలో ఉన్న భవనాన్ని పూర్తిగా తొలగించి వాటి స్థానంలో కొత్త భవనం మంజూరు చేయాలని కలెక్టర్ ను కోరారు స్పందించిన కలెక్టర్ వెంటనే భవనాన్ని కూల్చివేసి కొత్త భవనం కోసం ప్రతిపాదనలు పంపాలని తెలియజేశారు అనంతరం ఈ విషయం ఎంపీడీవోఎంఈఓ కి తెలిపి ప్రతిపాదనలు వెంటనే పంపాలని సూచించారు అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 50 సంవత్సరాలు కింద కింద నిర్మించిన భవనం శిథిలా వ్యవస్థకు చేరుకుందని ఇటీవల కురిసిన వర్షాలకు బాగా దెబ్బతిని కూలిపోయిందని వాటి స్థానంలో మళ్లీ భవనం నిర్మిస్తామని తెలిపారు ఈ విషయంపై కలెక్టర్ దృష్టికి తీసుకుపోయి కొత్త భవనం మంజూరు చేయిస్తానని తెలిపారు అంతవరకు పిల్లలను పాత భవనం వైపు పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు అదేవిధంగా మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల రెడ్డి వారి పల్లి,మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కొత్తవుడియం,) మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల శెట్టిపల్లి పాఠశాలల కు మెజర్ రిపైర్స్ కొరకు మండల ఇంజనీర్ ద్వారా వెంటనే ఎస్టిమేషన్స్ వేసి ప్రతిపాదనలు పంపించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారికి తెలియజేశారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార గ్రామీణ నీటి పారుదల సంస్థ కార్యనిర్వాహక ఇంజనీరు వారి కార్యాలయము, అన్నమయ్య విభాగం

షార్ట్ టెండరు ప్రకటన

టెండర్ ప్రకటన నెం : **01/ఆర్ఐసి/ అన్నమయ్య/ 2024-25** తేది: **19-10-2024**

అన్నమయ్య జిల్లా యందు 25.00 లక్షల అంచనా విలువ గల వివిద గ్రాంట్స్ క్రింద మంజూరు అయిన 02 పనుల కొరకు సీలు వేసిన టెండర్లు కోరబడుతున్నవి. టెండరు షెడ్యూలు దరఖాస్తు చివరి తేది 23.10.2024 టెండరు స్వీకరణకు చివరి తేది: 30.10.2024 మ॥ 3.30 గంటల వరకు .

మిగతా వివరములకు కార్యాలయ పనివేళ యందు సంప్రదించవలసినదిగా కోరడమైనది.

సం/- **కార్యనిర్వహక ఇంజనీర్, అన్నమయ్య విభాగం, అన్నమయ్య జిల్లా**

గ్రామీణ రోడ్లకు మహర్దశ

విశాలాంధ్ర-చెన్నూరు : పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా గ్రామీణ రోడ్లకు మహర్దశ వచ్చిందని తెలుగు దేశం పార్టీ మండల అధ్యక్షుడు కల్లూరి విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. శని వారం చెన్నూరులోని భవానీనగర్, బలసింగాయపల్లెలో పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా సీసీ రోడ్లకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తుందని గ్రామాలలో సీసీ రోడ్లు, మురికికాలువల ఏర్పాటు మొదటి ప్రాధాన్యంగా భావించి వేయడం జరుగుతుందన్నారు. ఆయా గ్రామా లలోని ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులకు సహకరించి గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు నాయకులు మల్లికార్జునరెడ్డి, కాపునాయ కులు ఆకుల ప్రసాద్‌బాబు, సీనియర్ మైనార్టీ నాయకులు షబ్బీర్ హుసేన్, టౌన్ కన్వీనర్ ఆకుల చలపతి, 12వ వార్డు మెంబర్ రామకృష్ణారెడ్డి, పోతిన శ్రీనివాసులు, సర్పంచ్ కళ్యాణ్, గౌస్‌పీర్, ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు, ఏపీఓ శైలజ, ఈఓపీఆర్‌డీ సురేష్‌బాబు, పంచాయతీ సెక్రటరీ రామసుబ్బారెడ్డి, కొక్కరాయపల్లె రాంప్రసాద్, చిన్నయ్య పాల్గొన్నారు.

చంద్రబాబు ఇది మంచి ప్రభుత్వం అనడం సబబు కాదు

విశాలాంధ్ర - జమ్మలమడుగు : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇది మంచి ప్రభుత్వం అనడం ఏ మాత్రం సబబు కాదని వైసిపి ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఉప్పలపాటి యోబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చినటువంటి సూపర్ సిక్స్ పథకాలు హామీలను వెంటనే అమలు చేయా లని డిమాండ్ చేశారు. కేవలం పెన్షన్ల పథకాన్ని అమలు చేసి మేమేదో ఘనకార్యం చేశామని చెప్పుకోవడం సమంజసం కాదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పాలసీలను అమలు చేస్తామనడం ఏమాత్రం మంచి పద్ధతి కాదని వెంటనే ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, 19 సంవత్సరాల నుండి 59 సంవత్స రాలు వయస్సు గల మహిళలకు నెలకు రూ.1500పథకాలను వెంటనే అమలు చేయాలని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను చంద్రబాబు నాయుడు విస్మరిస్తూ డైవర్ట్ పాలిటిక్స్ చేయడం సమంజసం కాదన్నారు. నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు ఏర్పాటు చేస్తామన్న హామీ ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు అవుతున్నప్పటికీ 20 లక్షల ఉద్యోగ కల్పన పక్కన పెడితే ఉన్న ఉద్యోగాలు తీసివేయడం జరుగుతుందన్నారు.అందులో భాగంగా వైజాగ్ స్టీల్ ప్లాంట్లో 5200 కాంట్రాక్టర్ ఉద్యో గాలు తొలగించారని ఆరోపించారు. అలాగే గవర్నమెంట్ మద్యం షాపులలో పనిచేస్తున్న 17వేల మంది ఉద్యోగులను నుండి తొలగించారని తెలిపారు. గ్రామ, వార్డు సచివాల యాల్లో పనిచేస్తున్నటువంటి వాలంటీర్లను ఉద్యోగ భద్రత లేకుండా రోజుకు ఒక మాట మాట్లాడడం సరైనది కాదన్నారు.

విష జ్వరాలు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి :కమిషనర్ మనోజ్ రెడ్డి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్:వర్షాకాలంలో ప్రజలకు విష జ్వరాలు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని కమిషనర్ ఎస్ మనోజ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం లోహియా నగర్, కృపా నగర్, ఎన్‌బీఐ కాలనీ, ఏఎస్ఆర్ నగర్, ఆచార్య కాలనీ, రామరాజు పల్లి వంటి ముఖ్య ప్రాంతాలను సందర్శించారు. ఈ పర్యటనలో కమిషనర్ గారితో కలిసి ఇంజనీరింగ్ మరియు శానిటేషన్ విభాగ అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంలో కమిషనర్ ఎస్ మనోజ్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం శుభ్రతను మెరుగుపర్చడం ముఖ్యమైన అంశాలపై దృష్టి సారించాలన్నారు. ఈ ప్రాంతాలు అధిక జనాభా ఉన్న చోటుగా, శానిటేషన్ మరియు వ్యర్థ నిర్వహణ వ్యవస్థలను సమర్థంగా నిర్వహించడం అత్యంత అవసరం అని ఆయన తెలిపారు. వ్యవస్థలు, వ్యర్థాల పారిశుధ్య విధానాలను పరిశీలించి, వర్షాకాలంలో నీరు నిలువకూడదు కాబట్టి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాంటి పరిస్థితులను నివారించడానికి అవసరమైన చర్యలు చేపడుతామని ఆయన తెలిపారు. ఎస్బిఐ కాలనీ వద్ద డ్రైనేజీ నిర్మాణాలకు తగిన ప్రణాళికలను సిద్ధం చేయవలసిందిగా ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు ఈ కార్యక్రమంలో సూపర్ డెంటింగ్ ఇంజనీర్ చెన్నకేశవరెడ్డి , ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ధనలక్ష్మి , అసిస్టెంట్ ఇంజనీర్ ప్రతాపరెడ్డి, శానిటేషన్ విభాగ అధికారులు నగరపాలక సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్ చొరవతో కస్తూరిబా బాలికల విద్యాలయ సమస్యలకు పరిష్కారం

విశాలాంధ్ర - వీరబల్లి : జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ గత నెల 18వ తేదీన వీరబల్లి మండల కేంద్రంలో ఉన్న కస్తూరిబా బాలికల గురుకుల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న సమస్యలను విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకురావడం జరిగింది. అదేరోజు రాత్రి ఆయన విద్యార్థినిల తో కలిసి భోజనం చేశారు. విద్యార్థినిల యొక్క సమస్యల విన్న ఆయన స్పందించి విద్యార్థినిల యొక్క సమస్యలు తీర్చాలని మండల అధికారులకు ఆదేశించడం జరిగింది. వెంటనే ఆ బాధ్యతలను ఇన్చార్జి ఎంపీడీవో గా పని చేస్తున్న రామచంద్రారెడ్డికి అప్పజెప్పడం జరిగింది. కలెక్టర్ ఆదేశాలను శిరసా వహించి పాఠశాల యొక్క మరుగుదొడ్లను, బాతు రూములను త్రాగునీటి సమస్య పనులను ప్రారంభించడం జరిగింది. ఈ పనులను పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. ఈ పనులపై శనివారం ఆయన పాఠశాలకు వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు మరుగు దొడ్ల పనులను, బాత్రూం పనులను పూర్తి చేయడమే కాకుండా త్రాగునీటి సమస్య తీర్చుటకు రెండు బోర్ల నుండి పైపు లైన్ల ద్వారా సిం టెక్సలకు నీటిసౌకర్యం కల్పించా మన్నారు. ఇక మీదట ఎటువంటి సమస్యలు లేకుండా పూర్తి చేశామన్నారు.పిల్లలకు బయట బట్టలు ఉతుకోవ డానికి కూడా సింటెక్స్ ట్యాంకు ఏర్పాటు చేసి కుళాయిలు అమర్చా మన్నారు. డ్రైనేజీ సమస్య లేకుండా పూర్తిగా చేశామన్నారు. బయట ఉన్న చిన్నచిన్న మైనర్ పనులు ఉన్నాయని వాటిని కూడా ఒకటి రెండు రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది విద్యార్థులు కలెక్టర్ కు ధన్యవాదాలు తెలిపారు.

ఆత్మీయ పురస్కారాలకు గెస్ట్ ఆఫ్ హానర్‌గా పసుపులేటి శంకర్

విశాలాంధ్ర -రాజంపేట: అఖిల భారత తెలుగు సాంస్కృతిక సమాఖ్య ఆంధ్రప్రదేశ్ కల్చరల్ అవేర్నెస్ సొసైటీ, అర్పిత సాహి త్య సాంస్కృతిక సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యములో జరుగ నున్న 24వ ఆత్మీయ పురస్కారాల ప్రధానోత్సవానికి రాజంపేట స్పెషల్ జ్యూడిషల్ మేజిస్ట్రేట్ డాక్టర్ పసుపులేటి శంకర్ ను గెస్ట్ ఆఫ్ హానర్‌గా కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ విజయకుమార్ నుంచి ఆహ్వానం అందినట్లు మేజిస్ట్రేట్ పసుపులేటి శంకర్ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ యూని యన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ప్రెస్ క్లబ్లు ఈ నెల 21 న ఈ కార్యక్రమం జరుగనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి మాజీ జెఈఓ, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బి.లక్ష్మి కాంతం ముఖ్య అతిథిగా, విశాఖపట్నం కు చెందిన అరుణ్ కుమార్ హానరబుల్ అతిథిగానూ, విజయవాడ గుణదల కార్పొరేటర్ సునీత ప్రత్యేక అతిథిగా పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాలలో ప్రతిభా పాటవాలు ప్రదర్శించిన వారికి ఆంధ్ర రత్న పేరుతో సత్కారాలు అందజేసి సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తారని నిర్వాహ కులు విజయకుమార్ ఆహ్వాన పత్రములో పేర్కొన్నారు.

పరిశుభ్రత పట్ల నిర్లక్ష్య తీరుపై జూనియర్ సివిల్ జడ్జి ఆగ్రహం

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : ప్రభుత్వ బాలుర,బాలికల వసతి గృహా లలో ఉంటున్న విద్యార్ధిని విద్యార్థులకు కల్పించే సౌకర్యాల పట్ల,పరిసర ప్రాంతాల అపరిశుభ్రత పై రైల్వేకోడూరు జూనియర్ సివిల్ జడ్జి పిజె తేజసాయి ఆగ్రహం వ్యక్తం చేశారు.రాష్ట్రీయ న్యాయ సేవా అధికార సంస్థ అమరావతి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కడప వారి ఆదేశాల మేరకు శనివారం వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలుర వసతి గృహాన్ని, ప్రభుత్వ బాలికల వసతి గృహం -1 లను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ప్రభుత్వ మెనూ ప్రకారం పిల్లలకు భోజనం అందుతుందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.వంట గదులను, టాయ్ లెట్లను,వసతి గృహాల పరిసరప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అపరిశుభ్రతపై ఆగ్రహం వ్యక్తం చేశారు.పిల్లల పట్ల, వారి ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయరాదన్నారు.పిల్లల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.విపిఆర్ ఖండ్రిక గ్రామ పంచాయతీ పరిధిలోని బందాల గట్టు వద్ద ఉన్న శ్రీసాయి ఈశ్వరమ్మ వృద్ధాశ్రమాన్ని పరిశీలించి అక్కడ ఉన్న వృద్ధులను సౌకర్యాలు ఎలా ఉన్నాయని వృద్ధులను అడిగి తెలుసు కున్నారు. వృద్ధాశ్రమం భద్రత కోసం కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేసు కోవాలని సూచించారు.అనంతరాజుపేట గ్రామపంచాయితీలోని ఎస్టీ మిని గురుకుల పాఠశాలను తనీఖీ చేశారు.విద్యాభివృద్ధిపైన, భోజనం మౌలిక వసతుల కల్పన పై బాలికలను అడిగి తెలుసుకున్నారు.పిల్లలను జాగ్రత్త చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.జూనియర్ సివిల్ కోర్టు టైపిస్టు భ్రమరాంబ, హెడ్ కానిస్టేబుల్ జి చంద్రశేఖర్,గంగరాజు పుష్పలత,దాసరాజు జయప్రకాష్, నారాయణ వర్మ,విజయవర్మ,బాలికల వసతి గృహం అధికారిణి జ్యోష్న తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ చేసిన కడప డిఎస్పి

విశాలాంధ్ర - ఒంటిమిట్ట : ఒంటిమిట్ట పోలీస్ స్టేషన్‌ను కడప డిఎస్పి వెంకటేశ్వర్లు శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డు లను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తిరుమల ఆక్టోపస్ ఆధ్వ ర్యంలో పోలీసులు కవాతు నిర్వహించే కార్యక్రమంలో భాగంగా తాను ఒంటిమిట్ట వచ్చినట్లు తెలిపారు. టిటిడి అనుబంధాల యాల్లో భక్తులను ప్రమాద నుండి ఎలా రక్షించాలని అంశంపై పోలీసుల మాక్ డ్రిల్ నిర్వహించినట్లు చెప్పారు. కోదండ రామా లయంలో సీసీ కెమెరాలు పనిచేసేలా చేస్తామన్నారు. హైవే రోడ్డులో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. పాత పోలీస్ క్వార్టర్స్‌లో రెండు ఎకరాల పోలీసులస్థలం కబ్జా గురైందని వెం టనే వాటిపై తనకు నివేదిక సమర్పించాలని సిఐని ఆదేశించారు. విలేకరులు పలు సమస్యలను డిఎస్పి దృష్టికి తెచ్చారు. కార్య క్రమంలో ఒంటిమిట్ట సిఐ కృష్ణంరాజు నాయక్, ఎస్ఐ శివ ప్రసాద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాము కాటుతో మహిళ మృతి

విశాలాంధ్ర-రామాపురం:పాము కాటుతో షేక్ తహరిన్ (70) అనే మహిళ శనివారం మృతి చెందినట్లు రామాపురం ఎస్ఐ వెంకట సుధాకర్ రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.రామాపురం మండలం హస నా పురం పంచాయతీ కస్పా కు చెందిన షేక్ తహరిన్ సెప్టెంబర్ 27వ తేదీన గ్రామం చివర్లోని గేదెలు మేపుకొని వెళ్ళిందని అక్కడ ఆమెను పాము కాటు వేయడంతో తన కుటుంబీకులు చికిత్స కోసం రాయచోటి ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో బెంగళూరు విక్టోరియా ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల శనివారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసామన్నారు.

పాలకొండ్రాయుడు స్వామికి తాళిబొట్లు సమర్పణ

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప నగర పరిధిలోని పాలకొండ్రాయుడు స్వామి దేవస్థానానికి కడప నగరం సీఎంఆర్ పల్లెకు చెందిన పాలకొండ్రాయుడు, సావిత్రమ్మ దంపతులు శనివారం పాలకొండ్రాయుడ స్వామి దేవస్థానానికి తాళిబొట్లు సమర్పించినట్లు పాలకమండలి చైర్మన్ బుర్రి రెడ్డయ్య యాదవ్. ఈవో శ్రీధర్, పూజారి యోగి స్వాములు తెలిపారు. ఈ సందర్భంగా పాలక మండలి చైర్మన్ బుర్రి రెడ్డయ్య యాదవ్ మాట్లాడుతూ. ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుండి ఆలయ అభివృద్ధి కొరకు కృషి చేస్తున్నానని తెలిపారు.

టీడీపీ నగర అధ్యక్షునిపై దాడిచేసిన వారిపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసిన అమీర్ బాబు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : తెలుగుదేశం పార్టీ కడప నగర అధ్యక్షులు పై దాడి చేసిన వారిని పట్టుకుని చర్యలు తీసుకోవాలని శనివారం జిల్లా ఎస్పీని కలిసి వినతి పత్రం సమర్పించిన టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు అమీర్ బాబు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప నగరంలో ఎప్పుడు కూడా ఇలాంటి సంస్కృతి లేదు మరి ఈ మధ్య ఎందుకో టిడిపి అధికారంలో ఉన్న నగర టిడిపి అధ్యక్షుడిపైనే ఇలా జరగడం చాలా దారుణమని కాబట్టి దాడి చేసిన వారు వారితో చేయించినవారు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని ఆయన కోరడం జరిగింది మా ఫిర్యాదు పై జిల్లా ఎస్పీ స్పందిస్తూ దాడి చేసిన వారు ఎంతటి వారైనా తప్పకుండా కఠినంగా శిక్షిస్తామని మాట ఇవ్వడం జరిగిందన్నారు. నగరంలో జరిగిన ఈ సంఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, లోకేష్ బాబు దృష్టికి తీసుకెళ్తామని చెప్పడం జరిగింది ఈ కార్యక్రమంలో సాలపురెడ్డి రవి శంకర్ రెడ్డి, కొండా సుబ్బయ్య, ఇమ్రాన్, క్రిస్టియన్ సెల్ జిల్లా అధ్యక్షులు ప్రేమ్ కుమార్, నాసర్ అలీ,మామిళ్ళ శివ, తదితరులు పాల్గొనరు.

అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేసిన కమీషనర్

విశాలాంధ్ర - బద్వేలు : బద్వేలు పట్టణంలోని అన్నా క్యాంటీన్ శనివారం మున్సిపల్ కమిషనర్ నరసింహా రెడ్డి పరిశీలించారు నాణ్యత ప్రమాణాలు తగ్గకుండా క్యాంటీన్ నిర్వహించాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కేటాయించిన సమయపాలన పాటించడంతో పాటు క్యాంటీన్ లోపల,చుట్టూపరిశుభ్రత, ప్లేట్స్ పరిశుభ్రత, మరియు సిబ్బంది యొక్క పనితీరు వంటి అంశాల గురించి ఆరాతీశారు. సిబ్బంది 'సమయపాలన, సంయనం, పరిశుభ్రత తప్పక పాటించాలని అన్నా క్యాంటీన్ లో పనిచేసే సిబ్బందికి సూచించారు.

శివ కొండారెడ్డి పై దాడిచేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి

సిపిఐ నగర కార్యదర్శి యన్. వెంకట శివ డిమాండ్

విశాలాంధ్ర-కడప రూరల్ : కడప నగరంలో చిన్నచౌక్ పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో టిడిపి నగర అధ్యక్షుడు సానపు రెడ్డి శివకొండా రెడ్డి పై మారణాయుధాలతో హత్యాయత్నం చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సిపిఐ నగర కార్యదర్శి యన్. వెంకట శివ డిమాండ్ చేశారు. చిన్నచౌక్ ప్రాంతంలో తమ నివాస సమీపంలో మెయిన్ రోడ్డు పై, పోలీస్ స్టేషన్కు దగ్గరలో టిడిపి నేత శివ కొండారెడ్డి పై అసాంఘిక శక్తులు ఇలాంటి దురాఘాతకానికి పాల్పడటం దారుణమన్నారు. సంబంధిత పోలీసు యంత్రాంగం వెంటనే నిందితులను గుర్తించి, అరెస్టు చేయాలన్నారు. కడప నగరంలో చాలా అంశాల పట్ల పోలీసులు ఉదారంగా వ్యవహరిస్తున్నారని, అలాకాకుండా అన్ని రకాల అసాంఘిక శక్తుల భరతం పట్టే విధంగా పోలీస్ యంత్రాంగం ఉక్కు పాదం మోపాలన్నారు.

ఉపసర్పంచ్ వార్డు మెంబర్లకు శిక్షణా తరగతులు

విశాలాంధ్ర-గాలివీడు:గ్రామ పంచాయతీల నిధుల నిర్వహణపై గత రెండు రోజులుగా శిక్షణా తరగతులు నిర్వహించినట్లు ఎంపిడిఓ జవహర్ బాబు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్ర,శనివారం రెండు రోజులపాటు జరిగిన శిక్షణా తరగతులు జరిగాయన్నారు. పంచాయతీ రాజ్ శాఖ పంచాయతీ, మండలానికి జిల్లాకు కేటాయించిన నిధుల నిర్వాహణ,పారిశుద్ధ్యం,మౌలిక సదుపాయాల కల్పన విధుల గురించి వివరించారు.

వెనుకబడ్డ రైల్వే అభివృద్ధికి సహకరించండి

రాష్ట్ర గనులు ఎక్సైజ్ శాఖ మంత్రిని కలిసిన ఇంఛార్జి రూపానందరెడ్డి

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : అభివృద్ధిలో వెనుక బడిపోయిన రైల్వేకోడూరు నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలా సహకరించాలని తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ముక్కారూపానందరెడ్డి రాష్ట్ర గనులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన శాసనసభ పక్ష సమావేశంలో పాల్గొని అక్కడే మకాం వేసి మరుసటి శనివారం రాష్ట్ర మంత్రిని కలిసి నియోజకవర్గ అభివృద్ధి పై సుదీర్ఘంగా చర్చించారు. రాష్టాబివృద్ధి దిశగా ప్రభుత్వం అత్యంత కీలకమైన అడుగులు వేస్తున్న సమయంలో ఓబులవారిపల్లి మండలంలోని మంగంపేట గ్రామపంచాయతీ పరిధిలోని గనుల డైంజర్ జోన్ పరిధిలోని భాదితులందరికి అన్ని విధాలా న్యాయం చేయాలని కోరారు.మంగంపేట సమస్యలు చాలా కాలంగా పరిష్కారానికి నోచుకోక పెండింగ్ లో ఉన్నాయని మంత్రికి వివరించారు. నూతన పారిశ్రామిక విధానం

ద్వారా మంగంపేట ప్రజలను ఆదుకోవాలని కోరారు.716 నెంబరు గల కడప రేణిగుంట జాతీయ రహదారి పక్కన ఆనంతరాజుపేట గ్రామపంచాయితీ పరిధిలో మూతపడిన ఆప్సా జ్యూస్ ఫ్యాక్టరీ పునః ప్రారంభించి నిరుద్యోగ యువతీ యువకులకు కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ మార్కెట్ యార్డును వినియోగంలోకి తీసుకువస్తే ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది, రైతులకు అన్ని విధాలా ఉపయోగ కరంగా ఉంటుందని మంత్రి దృష్టికి తెచ్చారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు ఈ నెల 31 వరకు గడువు పెంపు

విశాలాంధ్ర-రాయచోటి: ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్స్ ప్రవేశాలకు ఈ నెల 31వ తేదీతో గడువు ముగుస్తుందని అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి శివ ప్రకాష్ రెడ్డి, ఓపెన్ స్కూల్స్ జిల్లా కో ఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ స్కూల్స్‌లో ప్రవేశాలకు గడువు పెంచాలంటూ అన్ని వర్గాల నుండి వచ్చిన విజ్ఞప్తి మేరకు ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్స్ డైరెక్టర్ నాగేశ్వర రావు స్పందించి ముగిసిన గడువును ఈనెల 31వ తేదీ వరకు పొడిగించాలని తెలిపారు. ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఈ నెల 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని చెప్పారు. రూ.200లు అపరాధ రుసుముతో ఈ నెల 26వ తేదీ నుండి 29వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని, ఈ నెల 30, 31 తేదీలలో రూ.500 లు అపరాధ రుసుముతో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలియజేశారు. ఈ నెల 31వ తేదీ తర్వాత ఎటువంటి పరిస్థితుల్లో కూడా ఓపెన్ స్కూల్స్ ప్రవేశాలకు గడువు పెంచడం జరగదన్నారు. ఓపెన్ స్కూల్స్ ద్వారా పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లలో ప్రవేశం పొందాలనుకునే వారు సమీపంలో ఓపెన్ స్కూల్స్ అధ్యయన కేంద్రం ద్వారా గాని, మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం ద్వారా గాని, జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ద్వారా గాని సంప్రదించి ప్రవేశం పొందవచ్చునని వారు తెలియజేశారు.

కమీషనర్‌ను కలిసిన ఏఐటీయూసీ నాయకులు

విశాలాంధ్ర-కడప రూరల్ : కడప నగరపాలక సంస్థ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన మనోజ్ రెడ్డిని శనివారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షులు కేసి.బాదుల్లా, నగర అధ్యక్ష కార్యదర్శులు నరసింహులు, తారక రామారావు తదితరులు కలిశారు. ఈ సందర్భంగా కమీషనర్‌కు పూలమొక్కను అందజేశారు.

ఉపాధి హామీ పనులు సక్రమంగా నిర్వహించాలి - ఎంపీడీవో

విశాలాంధ్ర - ఒంటిమిట్ట : మండలంలో ఉపాధి పనులను ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీలతో సక్రమంగా నిర్వహించాలని ఒంటిమిట్ట ఎంపీడీవో సోమశేఖర్ ఆదేశించారు. ఒంటిమిట్ట వెలుగు కార్యాలయంలో శనివారం సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ 2023, 2024 జాతీయ ఉపాధి పనులు సోషల్ ఆడిట్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉపాధి హామీ ఏపిఓ శివశంకర్ రెడ్డి మాట్లాడుతూ హార్టికల్చర్ పనులు తనిఖీ చేయడం జరిగిందన్నారు. ఉపాధి హామీ పనులు పంచాయతీరాజ్ పనులపై ఈ నెల 29న బహిరంగ సభ నిర్వహించి ప్రభుత్వానికి నివేదికలు పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్పి కన్నారెడ్డి, పిఆర్ఏఈ, డిఆర్పి, ఎఫ్ఏ,టిఏలు,ఎఫ్‌సిలు పాల్గొన్నారు.

గొరిగనూరును ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతా..సర్పంచ్ పందింటి మత్తయ్య

విశాలాంధ్ర - జమ్మలమడుగు :జమ్మలమడుగు మండలంలోని గొరిగనూరు గ్రామ పంచాయతీని జిల్లాలోని ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఆ గ్రామసర్పంచ్ పందింటి మత్తయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన విశాలాంధ్రతో మాట్లాడుతూ గ్రామ ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్నానన్నారు. గ్రామాభివృద్ధి చేయాలన్న సంకల్పంతోనే సర్పంచ్ ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందాను అని అన్నారు. ఆనాటి నుండి నేటి వరకు గ్రామాభివృద్ధి చేయాలన్న దృఢ సంకల్పంతో ప్రభుత్వ సహకారంతో పని చేస్తున్నానని తెలిపారు. గ్రామ సర్పంచిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి ప్రభుత్వ సహకారంతో దాదాపు మూడు కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానని తెలిపారు. ముఖ్యంగా గ్రామంలో మౌలిక వసతులు కల్పనపై దృష్టి సారించడం జరిగిందన్నారు. అందులో భాగంగా గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, త్రాగునీరు సరఫరా, పారిశుద్ధ్య పనుల పై ప్రత్యేక శ్రద్ధ వహించి నిధులు వెచ్చించామన్నారు. అలాగే గొరిగనూరు గ్రామంలో సచివాలయంతో పాటు విలేజ్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని వర్మీ కంపోస్ట్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించాలని సంకల్పంతో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు చేయూతను అందిస్తున్నానని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి సహకారంతో రానున్న రోజుల్లో గొరిగనూరు గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దుతానని సర్పంచ్ మత్తయ్య తెలిపారు.

అభ్యసన వైకల్యాలపై అవగాహనా ర్యాలీ

విశాలాంధ్ర-నందలూరు : విద్యార్థుల్లో ఉన్న అభ్యసనా వైకల్యాలపై అవగాహన కల్పించేందుకు శనివారం మండల విద్యాశాఖ అధికారులు నాగయ్య, అనంత కృష్ణ ఆదేశాల మేరకు సమ్మిళిత ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డిపల్లె పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయలలిత మాట్లాడుతూ అక్షరాలు తలక్రిందులుగా రాయడం, వెనుకకు రాయడం, అక్షరాలు వదిలి చదవడం, రాయడం, గణితంలోనూ, మాట్లాడటం లోను , అర్థం చేసుకోవడంలోనూ, గుర్తించడంలోనూ సమస్యలు ఉన్న పిల్లలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చిన్న వయసులోనే గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తే వారి సామర్థ్యాలు మెరుగుపడి సాధారణ పిల్లల వల్లే అన్ని రంగాల్లో రాణిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమ్మిళిత ఉపాధ్యాయులు రంగస్వామి, వసుంధర, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి పై హత్యాయత్నం దారుణం నిందితులను కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర - బద్వేలు : బద్వేల్ గోపవరం మండలం సెంచరీ ప్లైవుడ్ కంపినీకి సమీపాన ఇంటర్ విద్యార్థినిపై హత్యాయత్నం ఘటనపై బద్వేల్ టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి విజయమ్మ బద్వేల్ టిడిపి సమన్వయ కర్త రితేష్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. బాధితురాలికి మెరుగైన వైద్యం అందించడంతో పాటు వారికి ప్రభుత్వం తరఫున అండగా ఉంటామన్నారు.ఎస్పీ మాట్లాడి వీలైనంత త్వరగా నిందితున్ని పట్టుకొని శిక్షలు పడేలా చూడాలన్నారు.

బోరెడ్డిగారిపల్లెలో బోరు ఏర్పాటు

విశాలాంధ్ర- గాలివీడు: మండలంలోని బోరెడ్డిగారిపల్లెలో మైనార్టీల విజ్ఞప్తి మేరకు మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయన సోదరుడు లక్ష్మీప్రసాద్ రెడ్డి చొరవతో బోరు డ్రిల్ చేసినట్లు మాజీ సర్పంచ్ మహమ్మద్ రఫీ తెలిపారు. శనివారం బోరెడ్డిగారి పల్లెలో త్రాగునీరు సమస్య పరిష్కారం కోసం బోరు బండికి పూజలు చేసి డ్రిల్ చేశారు. ఈకార్యక్రమంలో టీడీపి నాయకులు నాగేశ్వర రావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి,మాజీ సర్పంచ్ ఫరీద్ బాషా,మైనార్టీ నాయకులు బాబ్జీ,లాల్ బాషా, సలీం బాషా,అబ్దుల్ నబీ,ఖాదర్ వలీ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి మునగాకు : సిడిపిఓ పద్మావతి

విశాలాంధ్ర- రామాపురం: గర్భవతులు బాలింతలు ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారంలో మునగాకు తీసుకోవాలని లక్కిరెడ్డిపల్లి సిడిపిఓ పద్మావతి తెలిపారు. మండలంలోని గువ్వలచెరువు సెక్టార్ లోని బంగ్లాదేశ్ అంగన్వాడి కేంద్రం నందు శనివారం గర్భవతులకు బాలింతలకు మహిళలకు ఆరోగ్యం, ఆహారం పదార్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మహిళలు గర్భవతులు బాలింతలు తీసుకునే ఆహారంలో విటమిన్ ఏ. విటమిన్ బి1,బి2 బి 3 బి 6. విటమిన్ సి. కాల్షియం ఉంటాయని తెలిపారు. ఐసిడిఎస్ హుస్సేన్ అమ్మ పద్మజ అంగన్వాడీ టీచర్స్ బాలింతలు మహిళలు పాల్గొన్నారు.

వ్యవసాయ పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడి -ఏవో

విశాలాంధ్ర- రామాపురం: రైతులు తమ పంట పొలాలను సాగు చేసేటప్పుడు వ్యవసాయ పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయ అధికారిని వై. నాగమణి అన్నారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా గోపగుడిపల్లి గ్రామంలోవేరుశనగ పంటలో క్షేత్ర దినోత్సవం శనివారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రైతు పద్ధతికి సమగ్ర వ్యవసాయ పద్ధతులు పాటించిన పొలానికి మధ్య దిగుబడిలో వ్యత్యాసాలను గమనించడం జరిగిందన్నారు. సమగ్ర వ్యవసాయ పద్ధతులు పాటించిన పొలంలో అధిక దిగుబడి రావడం జరిగిందని ఎందుకంటే సమగ్ర పోషక యాజమాన్యం, సమగ్ర ఎరువుల యాజమాన్యం, సమగ్ర పురుగు మరియు తెగుళ్ల యాజమాన్యం చేయడం ద్వారా అధిక దిగుబడికి దోహదం అయిందని ఆమె అన్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం నుంచి వ్యవసాయ అధికారులు అలాగే కృషి విజ్ఞాన కేంద్రం కడప నుంచి శాస్త్రవేత్తలు రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

వంట ఏజన్సీల సమస్యలు పరిష్కరించాలి

ఎస్టీయు రాష్ట్రనాయకులు పి.రమణారెడ్డి, యు.సుబ్రమణ్యం డిమాండ్

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్ : సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న మధ్యాహ్న భోజన పథకం సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని ఎస్టీయు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి, సిపియస్ రాష్ట్రకమిటీ కన్వీనర్ యు.సుబ్రమణ్యం ప్రభుత్వాన్ని కోరారు. శనివారం పోరుమామిళ్ల లోని ఎస్టీయు భవన్ నందు రీజనల్ కన్వీనర్ వి.వి.క్రిష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో రమణారెడ్డి, సుబ్రమణ్యంలు మాట్లాడుతూ, ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకమైన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం సవ్యంగా సాగాలంటే పేరుకు పోయిన వంట ఏజన్సీల సమస్యలు పరిష్కరించినపుడే సాధ్యమవుతుందన్నారు. వంట ఏజన్సీలకు చెల్లించే నెలవారీ గౌరవవేతనం 2వేలు, 3వేలు ఏమూలకు సరిపోతాయో ఆలోచించాలన్నారు. గౌరవవేతనం కనీసం 6వేలు అయినా చెల్లించాలన్నారు. వంటఛార్జీల నిమిత్తం ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5-88, ప్రాథమికోన్నత, హైస్కూల్ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.8-57 వంతున చెల్లిస్తున్నారని, నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్న ప్రస్తుత పరిస్థితులలో ఈ ధర లతో నాణ్యమైన, రుచికరమైన కూరలు,వంటలు ఎలా అందిం చగలరో ప్రభుత్వ పెద్దలు ఆలో చించాలన్నారు. నేటి ధరలకు అనుగుణంగా వంట ఛార్జీలను ప్రాథమికపాఠశాలల విద్యార్థులకు కనీసం రూ.10లు,ప్రాథమికోన్నత, హైస్కూల్ వారికి రూ.17లు చెల్లిం చినపుడే సాధ్యపడుతుందన్నారు. అదే విధంగా బియ్యంలో కూడా నాణ్యత లేనం దున పిల్లలు సరిగా తినలేకున్నారని, కావున నాణ్యమైన సన్నరకం బియ్యం సర ఫరా చేయాలన్నారు. మెనూ మాత్రం ఆకర్షణీయంగా రూపొందించి,అమలులోని ఇబ్బందులను గుర్తించి, తగు చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే పేద, బడుగు, బలహీన, మధ్యతరగతి వర్గాల పిల్లలకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించేలా ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రకౌన్సిలర్ చంద్రహాసరెడ్డి, సీనియర్ నాయకులు వాకా చంద్రశేఖర్, బాలరాజు, సుబ్బారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు గురయ్య, వెంకట రామయ్య,శ్రీనివాసులు, మూల రామక్రిష్ణారెడ్డి, మండల నాయకులు రవీంద్ర బాబు, పుల్లయ్య, బాలఓబయ్య, జయరామిరెడ్డి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో కొత్త బసవాపురం పాఠశాల...

బడికి వెళ్లాలంటే భయపడుతున్న విద్యార్థులు

విశాలాంధ్ర-బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠం మండలంలోని తెలుగుగంగ ప్రాజెక్టు సమీపంలో ఉన్న కొత్త బసవాపురం పాఠశాల శిథిలావస్థకు చేరే పరిస్థితులలో ఉంది. బ్రహ్మసాగర్ ముంపు గ్రామమైన బసవాపురం గ్రామ ప్రజలు, భూములు, ఇళ్లు కోల్పోయి, పునరావాసం కింద కొత్త బసవాపురం అనే గ్రామాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ గ్రామంలో ఒకటవ తరగతి నుండి 5వ తరగతి వరకు చదువుకునే విద్యార్థిని, విద్యార్థులు 26 మంది ఉండగా, అక్కడ ఇద్దరు ఉపాధ్యాయులు విద్యా బోదన చేస్తున్నారు. అయితే దసరా ఉత్సవాలకు ముందు కురిసిన భారీ వర్షానికి చుట్టూ ఉన్న ప్రహరీగోడ సగం కూలిపోవడం, చిన్నపాటి వర్షం వచ్చినా కూడా పాఠశాల భవనాలు నీరుకారడం, వర్షంతో వచ్చిన నీరు అంతా పాఠశాల ప్రాంగణంలోనే నిల్వ ఉండటం జరుగుతుంది. ఈ మధ్య గత ఐదు రోజులనుండి కురుస్తున్న భారీ వర్షాలకు పిల్లలు బడికి పోవాలంటేనే భయపడే పరిస్థితి వచ్చింది. గత ప్రభుత్వంలో నాడు- నేడు పథకంలో అధికారుల నిర్లక్ష్యం వలన బసవాపురం బడి అభివృద్ధికి నోచుకోలేదు, ప్రస్తుతం ఉన్న ఈ ప్రభుత్వంలోనైనా ఈ బడిని అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు. మండల విద్యాశాఖ అధికారి, జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి బసవాపురం బడిని అభివృద్ధి చేయాలని గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు.

రెవెన్యూ ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే గ్రామ సభలు :తాహశీల్దార్ దామోదర్ రెడ్డి

విశాలాంధ్ర - బ్రహ్మంగారిమఠం : మండలంలోని రీ సర్వే పూర్తయిన గ్రామాలలో ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా గ్రామసభ లో అభిప్రాయాలు సేకరణ అర్జీలను సేకరించి వారి సమస్యలను పరిష్కరిస్తామని అందులో భాగంగానే రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నమని తాహశీల్దార్ దామోదర్ రెడ్డి పేర్కొన్నారు. అందులో భాగంగానే మొదటిరోజు దిరసవంచ, రెండో రోజు మల్లెపల్లె పంచాయతీలో రెవెన్యూ గ్రామ సభలు ఏర్పాటు చేశామని ఈ సభలకు హాజరైన తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు, చెన్నుపల్లి సుబ్బారెడ్డి స్థానిక సర్పంచ్, భర్త నారాయణ యాదవ్, కలిసి రెవెన్యూ గ్రామసభలు చేపట్టారు. అందులో భాగంగా రైతుల నుండి అర్జీలు స్వీకరించి వారి సమస్యలను పరిష్కరించే విధంగా త్వరలో నిర్ణయం తీసుకుంటామని రికార్డులో వారి పేర్లు నమోదు చేర్పులు మార్పులు సాగులో ఉన్న వాటి వివరాలను సేకరించి సమస్యలను పరిష్కరించే విధంగా జిల్లా జాయింట్ కలెక్టర్, ఆర్డిఓ దృష్టికి తీసుకెళ్లి త్వరలో సమస్యలను పరిష్కరించే విధంగా చూస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తాహశీల్దార్ సాంబశివారెడ్డి, రెవెన్యూ సిబ్బంది, రైతులు, ప్రజలు, తెలుగుదేశం పార్టీ నాయకులు, మేకల సుధాకర్ యాదవ్, నాగయ్య యాదవ్, లింగాల దీన్నే పల్లె, నరసింహారెడ్డి బాలి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలు అనవసరం

అనుమానాలు వున్నప్పుడు మనం వాడడం ఎందుకు?

డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి, సంగటి మనోహర్

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : జమిలి ఎన్నికల నిర్ణయం పిచ్చి తుగ్లక్ నిర్ణయమని,ఇది ఆచరణ సాధ్యం కాదని,అమెరికా లాంటి అభివృద్ధి చెందిన దేశాలే ఈవీఎంలు వాడకుండా బ్యాలెట్ పేపర్ వాడుతున్నప్పుడు మనమెందుకు బ్యాలెట్ పేపర్ వాడకూడదని రాజ్య సభ మాజీ సభ్యులు, ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసి రెడ్డి, పార్లమెంటరీ ప్రజాస్వామ్య పరిరక్షణ జాతీయ ఉద్యమ నాయకుడు సంగటి మనోహర్ అన్నారు. శనివారం కడప ప్రెస్ క్లబ్‌లో ఎన్నికల అక్రమాలు, ఈవీఎంలు, జమిలి ఎన్నికలు అనే అంశాలపై ప్రత్యేక చర్చా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశమంతటా లోక్ సభకు,అన్ని రాష్ట్రాల అసెంబ్లీ లకు,స్థానిక ప్రభుత్వాలకు ఒకేసారి ఎన్నికలు జరపడం (జమిలి ఎన్నికలు) సాధ్యం కాదనిఅభిప్రాయపడ్డారు. ఇందుకు 18 రాజ్యాంగ సవరణలు చేయాలి.లోక్ సభ,రాజ్య సభలో మూడింట రెండొంతుల మెజారిటీ వుండాలి.అందుకు మోడీ ప్రభుత్వానికి లోక్ సభలో 69 సీట్లు,రాజ్య సభలో43 సీట్లు తక్కువ ఉన్నాయన్నారు. ఎన్నికల ఖర్చు మొత్తం బడ్జెట్ లో 0.02 శాతం మాత్రమే.కాబట్టి ఎన్నికల ఖర్చు తగ్గించడం కోసమే జమిలి ఎన్నికలు అనడంలో అర్థం లేదన్నారు. మనది సమాఖ్య వ్యవస్థ.దీనికి జమిలీ ఎన్నికలు విరుద్ధం. అభివృద్ధి చెందిన అమెరికా దేశంలో కూడా జమిలిఎన్నికలు లేవు జమిలీ ఎన్నికలు అవినీతికి,నియంత్రుత్వానికి దారి తీస్తాయి అని తులసి రెడ్డి,మనోహర్ అన్నారు. అమెరికా, బ్రిటన్ లాంటి అనేక అభివృద్ధి చెందిన దేశాలు ఈవీఎంలకు బదులు బ్యాలెట్ పేపర్లు వాడుచున్నాయని, అద్వానీ, సుబ్రమణ్య స్వామి, రాహుల్ గాంధీ, చంద్రబాబు, జగన్ లాంటి అనేక మంది ఈవీఓంల పై అనుమానాలు వ్యక్తం చేస్తున్నప్పుడు ఎన్నికల కమిషన్ బ్యాలెట్ పేపర్లు ఎందుకు వాడకూడదని వారు ప్రశ్నించారు. లేదా వీవీప్యాట్ స్లిప్పులు ఓటర్ చేతిలోకి వచ్చి ఓటరు బాక్స్‌లో వేసే విధంగా ఈవీఎంలలో మార్పు తేవాలన్నారు.ఈ కార్యక్రమంలో అవ్వారు మల్లికార్జున, చంద్రశేఖర్, రవిశంకర్ రెడ్డి, షేక్ అమీన్ పీరా, అఫ్జల్ ఖాన్, సయ్యద్ సలావుద్దీన్, డాక్టర్ శ్రీనివాసులు, అబ్దుల్ సత్తార్, గోసాల దేవి, శాంతయ్య, కదిరి ప్రసాద్ గౌడ్, సుబ్బరామయ్య, షేక్ ఉమేరా, శ్యామలమ్మ, నాగరత్నగౌడ్ పాల్గొన్నారు.

ఉప సర్పంచ్. వార్డు మెంబర్లుకు శిక్షణ తరగతులు

విశాలాంధ్ర-రామాపురం:మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం 13 గ్రామ పంచాయతీల ఉప సర్పంచ్‌లకు. వార్డు మెంబర్లు లకు శిక్షణ తరగతులను నిర్వహించినట్లు ఎంపీడీవో జాషువా అన్నారు. ఈ సమావేశంలో ఆయన గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఉప సర్పంచులు వార్డు మెంబర్లు బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రస్తుత వర్ష బావ పరిస్థితుల్లో గ్రామాలలో అంటు వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలుగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డి పట్నాయక్ ఏవో చాన్ భాష ఉప సర్పంచ్లు వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు వార్డుసభ్యులకు అవగాహనా తరగతులు

విశాలాంధ్ర-వీరబల్లి :మండలంలో సర్పంచులు ఉప సర్పంచులు, వార్డ్ మెంబర్లు శిక్షణ, అవగాహన తరగతుల నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈవో మైథిలి పాల్గొన్నారు. కార్యక్రమానికి ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి అధ్యక్షత వహించారు. స్థానికంగా కొన్ని సమస్యలు ఉంటాయి కానీ సర్పంచులు అవి సాకుగా చెప్పకుండా ప్రజలకు ఉపయోగపడేవి కలకాలం గుర్తుండాలని నాయకులు సర్పంచులు చెయ్యాలి అని తమ సందేశంలో మైథిలి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నూర్జహాన్, ఈ ఓ ఆర్ డి రామచంద్ర రెడ్డి , సర్పంచులు ఆంజనేయులు సానిపాయి, గోపీనాథ్ రెడ్డి తాటిగుంట్లపల్లి, తరిగొండ ఈశ్వరయ్య గుర్రప్ప గారి పల్లె, రవి దిగువ రాచపల్లి, శివరాం ఓదివీడు, నాగార్జున చారి మట్లి, పంచాయతీ సెక్రటరీలు,వెలుగు,ఉపాధి,ప్రభుత్వఉద్యోగులు పాల్గొన్నారు. సర్పంచులు ఎంపీపీచే సన్మాన చేశారు.

మిట్స్ లో విద్యార్థి చాప్టర్ ప్రారంభోత్సవం కార్యక్రమం

విశాలాంధ్ర-మదనపల్లె: మదనపల్లె సమీపం లో గల మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్ నందు ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐ ఎస్ టి ఈ) విద్యార్థి చాప్టర్ ప్రారంభోత్సవం కార్యక్రమాన్ని ఏర్పాటుచేసినారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా ప్రొఫెసర్ బి. ఈశ్వర రెడ్డి, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్, జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం అనంతపురం మరియు సెక్రెటరీ-కమ్-ట్రెజరర్ ఆఫ్ ఐ ఎస్ టి ఈ పాల్గొన్నారు. ఆయన ఐ ఎస్ టి ఈ విద్యార్థి చాప్టర్ ను ప్రారంభించడం జరిగింది. కార్యక్రమం లో ఆయన మాట్లాడుతూ ఇది విద్యార్థులలో వృత్తిపరమైన మరియు సాంకేతిక వృద్ధిని పెంపొందించడంలో ఒక ముఖ్యమైన మైలురాయిని ఆయన అన్నారు. సాంకేతిక విద్య యొక్క ప్రాముఖ్యతను మరియు తరువాతి తరం ఇంజనీర్లు మరియు సాంకేతిక నిపుణులను రూపొందించడంలో ఐ ఎస్ టి ఈ పాత్ర స్ఫూర్తిదాయకమని, విద్యార్థులకు వారి జ్ఞానం, నైపుణ్యాలు మరియు నాయకత్వ సామర్థ్యాలను పెంపొందించడానికి ఒక వేదికగా ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్ మాట్లాడుతూ ఐ ఎస్ టి ఈ సభ్యులు కు జర్నల్‌లు, ప్రచురణలు మరియు ప్రత్యేకమైన వెబ్‌నార్లతో సహా విద్యార్థులకు సాంకేతికత మరియు ఇంజనీరింగ్ విద్య రంగంలో నిపుణులు మరియు పరిశోధకుల అనుభవాల నుండి నేర్చుకునే అవకాశాన్ని కల్పిస్తాయి అని అన్నారు. ఈ కార్యక్రమం లో ఐ ఎస్ టి ఈ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీ దివ్య, విభాగాధిపతులు, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధే లక్ష్యం:షాజహాన్ భాష

విశాలాంధ్ర-రామసముద్రం: అభివృద్ధి ఆంధ్ర ప్రదేశ్ కూటమి ప్రభుత్వ లక్ష్యమని మదనపల్లి ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్ భాష పేర్కొన్నారు శనివారం అయినా రామసముద్రం మండలంలో విస్తృతంగా పర్యటించి సిమెంట్ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్‌ని అభివృద్ధి పథంలో కొనసాగిస్తూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని కొనియాడారు. మొదటగా కురిజల గ్రామంలో భూమి పూజ చేసి పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. రామసముద్రం మండలానికి కోటి యాభై లక్షల రూపాయలతో నాలుగు కిలోమీటర్ల 220 మీటర్లు సిమెంట్ రోడ్లు అలాగే ఐదు కిలోమీటర్ల 200 మీటర్లు తారు రోడ్లకు రెండు కోట్ల 70 లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు . అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళలో కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గౌని వారి వారి విజయకుమార్ గౌడ్ డిఈ శివప్రసాద్ ఎంపీడీవో భాను ప్రసాద్ ఏపీవో గౌరీ శంకర్ ఏపిఎం సాంబశివ మాజీ మండల పార్టీ అధ్యక్షులు కొండూరు నారాయణరెడ్డి కృష్ణంరాజు యాదవ్ మాజీ జెడ్పిటిసిలు వెంకటస్వామి శివశంకర్ తిప్పన్న రాజేష్ మండల తెలుగు యువత అధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి సుధాకర్ రెడ్డి రూపేష్ రెడ్డి మహేష్ రెడ్డి రెడ్డప్ప రెడ్డి బాలాజీ కృష్ణమూర్తి శ్రీనివాస్ నాయుడు రమేష్ రెడ్డి జావిద్ భాస్కర్ యాదవ్ రామ్మూర్తి వెంకటేష్ వికాస్ చంద్రప్ప వెంకటరమణ వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డిస్లెక్షియా పై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-గుర్రంకొండ: భవిత కేంద్రం ఆధ్వర్యంలో గుర్రంకొండ తెలుగు ప్రాథమిక పాఠశాలలో శనివారం డిస్లెక్షియా పై అవగాహన పెంపొందించుటకు విద్యార్థుల తో అవగాహన ర్యాలీని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జనార్ధన్ మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులు ఎవరైతే ఉన్నారో వారిలో అభ్యాసనకు సంబంధించిన లోపాలు ఉంటాయని ఆ వైఫల్యాలను ప్రత్యేక శిక్షణ ద్వారా సరిదిద్ద వచ్చని తెలిపారు. అభ్యాసన సమస్యలు కలిగిన పిల్లలను గుర్తించి ఉపాధ్యాయుల ద్వారా తరగతిలో అభ్యాసన సమస్యలు గల పిల్లలకు తగిన శిక్షణ అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సురేంద్రబాబు జి కే ఉమాదేవి మీనా కుమారి ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులతో ర్యాలీ అవగాహన సమావేశం

విశాలాంధ్ర-సుండుపల్లె: మహిళలు, బాలికల సంరక్షణ మనందరి బాధ్యత అని మండల విద్యాశాఖ అధికారి రవీంద్ర నాయక్, గుడ్ అన్న యువర్ ఫౌండేషన్ అధ్యక్షులు నాగేశ్వర్ లు తెలిపారు. మానవ అక్రమ రవాణా నిషేధ దినోత్సవం సందర్భంగా శనివారం జీకే రాచపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇండియా ముంబై ఆర్గనైజేషన్ వారి సహకారంతో గుడ్ నైబర్స్ సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులతో సమావేశాన్ని నిర్వహించారు. చిన్నపిల్లలను పట్టణ ప్రాంతాలకు రవాణా చేసి భిక్షాటన చేయిస్తున్నారని, బాలికలను ఉపాధి పేరుతో వ్యభిచార గృహాలకు తరలిస్తున్నారని తెలియజేశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలను ప్రభుత్వ సంస్థలు మరియు స్వచ్ఛంద సంస్థలు అడ్డుకొని మహిళలను రక్షించే ప్రయత్నం చేస్తున్నారని విద్యార్థులకు తెలియజేశారు. ప్రతి ఒక్కరు బాగా చదువుకుని సమాజంలో ఎలా మెలగాలి అనే విషయాలను తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్ర మంలో ప్రధానోపాధ్యాయురాలు సుమలత, పిల్లల సంరక్షణ లీగల్ అధికారి కౌరున్ తదితరులు పాల్గొన్నారు.

ప్రియుడి చేతిలో మోసపోయిన యువతి

బిడ్డకు జన్మనివ్వడంతో బయటపడిన వైనం

విశాలాంధ్ర-మదనపల్లె : ప్రియుని మాయలో పడి మోసపోయిన యువతి పెళ్లి కాకనే పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. సభ్య సమాజం తలదించుకునే ఈ అమానుష ఘటన శనివారం మదనపల్లె సర్వజన బోధనాస్పత్రిలో వెలుగు చూసింది. యువతి బంధువులు తెలిపిన వివరాల మేరకు.. గుర్రంకొండ మండలం, మర్రిపాడు గ్రామం లోని ఓ పల్లెకు చెందిన (19) ఏళ్ళ యువతి టీచర్ ట్రైనింగ్ పూర్తి చేసి ఇంటి పట్టునే ఉంటోంది. అదే గ్రామానికి చెందిన యువకుడు ప్రేమ పేరుతో యువతికి దగ్గరయ్యాడు. పెళ్ళి చేసుకుంటానని నమ్మించాడు. ఫలితంగా యువతి గర్భం దాల్చింది. ఈ విషయాన్ని కుటుంబీకులకు తెలియనివ్వకుండా యువతి గోప్యంగా ఉంచింది. పెళ్లి చేసుకుంటానని నమ్మబలికిన ప్రియుడు మోసం చేసి గుట్టు చప్పుడు కాకుండా దేశం విడిచి కువైట్ కు వెళ్లిపోయాడు. దీంతో ఆ యువతికి నెలలు నిండడంతో దిక్కు తోచని పరిస్థితిలో పడింది. ప్రసవ నొప్పులు రావడంతో బంధువుల సాయంతో శనివారం ఉదయం మదనపల్లె సర్వజన బోధన ఆసుపత్రిలో చేరింది. అప్పటికే అధిక రక్తస్రావం జరగడంతో గుర్తించిన ఆసుపత్రి వైద్యులు యువతిని ప్రసూతి విభాగానికి తరలించి సాధారణ కాన్పు చేయడంతో పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు మదనపల్లి ఆసుపత్రిలో ఉన్న బిడ్డ చెంతకు చేరుకుని తన బిడ్డను మోసం చేశాడని, పోలీసులే తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

మద్యం, ఇసుకపై బహిరంగ చర్చకు సిద్ధమా

కడప జిల్లా పార్లమెంట్ టిడిపి అధికార ప్రతినిధి పి.మునిశేఖర్ రెడ్డి

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: మద్యం, ఇసుకపై బహిరంగ చర్చకు సిద్ధమా అని కడప జిల్లా పార్లమెంట్ టిడిపి అధికార ప్రతినిధి పి.మునిశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం చాపాడులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పి.మునిశేఖర్ రెడ్డి మాట్లాడుతూ నిన్నటి దినం మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మద్యం దందా, ఉచిత ఇసుక ఎక్కడైనా ఇచ్చారా అని మాట్లాడుతుంటే రాష్ట్ర ప్రజలు అసహ్యించుకుంటున్నారని అన్నారు. అయ్యా జగన్‌మోహన్ రెడ్డి గారు దశలవారీగా మద్యం నిషేధం అని చెప్పి 2019లో అధికారంలోకి వచ్చి మద్య నిషేధం చేయకపోగా, బేవరేజెస్ కార్పొరేషన్ షూరిటీ పెట్టి 30వేల కోట్లు అప్పు తెచ్చి సంక్షేమ పథకాల ముసుగులో ప్రజల ప్రాణాలను బలిగొన్న విశయం మర్చిపోయారా అని ప్రశ్నించారు. మీరు తెచ్చిన మద్యం పాలసీ రద్దు చేసి పేద ప్రజలకు మేలు చేసే కొత్త మద్యం పథకం పాలసీ తెచ్చి 72గంటలు కూడ కాలేదు అప్పుడే ఉలుకు ఎందుకు అన్నారు. అలాగే కూటమి ప్రభుత్వం వచ్చిన నాలుగు నెలల్లోనే ఉచిత ఇసుక ప్రజల కోసం ప్రవేశపెట్టినారని, ఉచిత ఇసుక ప్రజలకు అందడంలో ఇంకా కొన్ని లోపాలు ఉన్నాయని ఎమ్మెల్యేలు, అధికారులు సీఎం దృష్టికి తెచ్చిన మరుక్షణమే సీనరజీ, జిఎస్టీ రద్దు చేయుటకు నిర్ణయం తీసుకున్నారన్నారు. ఇది చంద్రబాబు నాయుడు గారి పాలన అంటే మీ పరిపాలనలో ఇసుక, మద్యం ధరలతో కార్మికులకు ఉపాధి లేక వేలాది కుటుంబాలు ఆత్మహత్య చేసుకున్న విషయం మర్చిపోయారా! అలాగే మీ నాయకులు తయారు చేసిన కల్తీ మద్యం తాగి చనిపోయి వేల కుటుంబాలు రోడ్డున పడిన విశయం మర్చిపోయారా! అని ప్రశ్నించారు.

ఆరోగ్యపురంలో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర- సుండుపల్లి: మండలం ముడుం పాడు గ్రామము ఆరోగ్యపురంలో పించ సబ్ సెంటర్ రాయవరం వైద్య సిబ్బంది ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు అందులో భాగంగా జిల్లా గిరిజన నాయకుడు ఏపీ సీఆర్ఎఫ్ జిల్లా అధ్యక్షులు,టీడీపీ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు అమ్మనాయక్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షం బాగా పడుతూ ఉంది వ్యాధులు వచ్చే అవకాశం ఉంది కాబట్టి ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆశ వర్కర్లు కూడా కచ్చితంగా ఇంటింటికి తిరిగి ఈ దోమల బెడద నుంచి అందరు కాపాడుకోవాలని శుభ్రంగా ఉండాలని వేడి నీళ్లు త్రాగాలని తగు సూచనలు ఇవ్వాలని ఆయన కోరారు ఎలాంటి వ్యధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పడం జరిగినది.ఈ కార్యక్రమంలో ప్రేమలత సౌజన్య ఆశ వర్కర్స్ శ్యామల జమున రాణి ఓబులమ్మ రెడ్డమ్మ సవాగ్రప్రసాద్ పాల్గొన్నారు.

హెచ్ఐవి ఎయిడ్స్‌పై అవగాహన సమావేశం

విశాలాంధ్ర- పీలేరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ జిల్లా ఎయిడ్స్. నియంత్రణ, మరియు నివారణ సంస్థ ఈ రోజు కోర్ స్వచ్ఛంద సంస్థ పీలేరు జిల్లా పరిషత్ హై స్కూల్ కోటపల్లి నందు మీకు తెలుసా ? హెచ్ఐవి ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగేంది.ఈ కార్యక్రమంతో హెచ్. వె. వి/ ఎయిడ్స్ ఎలా వస్తుంది ఎలా రాదు హెచ్ఐవి స్థితిని ప్రారంభంలోనే తెలుసుకొని జాగ్రత్త తీసుకోకపోతే ఎయిడ్స్ దశకు చేరే అవకాశం వుంటుందని, హెచ్.వై.వి వ్యాధి గ్రస్తులు పట్ల వివక్ష చూపరాదని హెచ్, ఐ . వి/ ఎయిడ్స్, క్షయ వ్యాధి సుఖవ్యాధులను నియంత్రించడంలో కండోమ్ ముఖ్య పాత్ర హెచ్ఐవి ఎయిడ్స్ ఎయిడ్స్ ప్రివెన్షన్ ఏటీ 2017, మందులు ఏపీ సాక్స్ అప్ టోల్ ఫ్రీ నెంబర్ 1097 కు పోన్ చేస్తే హెచ్, వె.విపై ఎక్కువ విషయాలు తెలుసుకోవచ్చు అని పిల్లలకు అనగాహనకల్పించడం జరిగింది' ఈ కార్యక్రమంలో కోర్ సిబ్బంది కె.రాజమ్మ కె.రెడ్డి రాణి ఎస్.షర్మిల స్కూల్ సిబ్బంది రామచంద్ర నాయుడు శేషాద్రి రెడ్డి ఆర్ వెంకట్ రెడ్డి వసంత కుమారిలు పాల్గొన్నారు.

చల్లా రాజగోపాల్ ఆధ్వర్యంలో అన్నదానం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: తెలుగుదేశం పార్టీ బీసీ నాయకులు, ప్రొద్దుటూరు కృష్ణాలయ కమిటి చైర్మెన్ చల్లా రాజగోపాల్ ఆధ్వర్యంలో శనివారం సంధర్భంగా స్థానిక మైదుకూరు రోడ్డులోని అన్వర్ హాల్ వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. స్వీటు కేసరి, వైట్ రైస్, ఆకుకూర పప్పు, పెరుగన్నం, పల్లీల చట్నీ, అరటి పండ్లు దాదాపు 1000మందికి మంచి రుచికరమైన నాణ్యమైన భోజనాన్ని అందించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో వృద్ధులు, పాదాచారులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని అన్నదాత చల్లా రాజగోపాల్‌ను ఆశీర్వదించారు.

మానవ అక్రమ రవాణా లేని సమాజ నిర్మాణమే లక్ష్యం

వాక్ ఫర్ ఫ్రీడమ్ కార్యక్రమంలో జడ్జి వెంకటేశ్వర నాయక్

విశాలాంధ్ర- మదనపల్లె : మానవ అక్రమ రవాణా లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా అందరూ కృషి చేయాలని మదనపల్లె ప్రిన్సిపల్ సివిల్ జడ్జి వెంకటేశ్వర నాయక్ పేర్కొన్నారు. శనివారం గ్రామజ్యోతి సొసైటీ ఆధ్వర్యంలో ఎ21 ఆస్ట్రేలియా ద మూమెంట్ ఇండియా ముంబై శ్యామ్ వారి సహాయ సహకారంతో స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల నందు వాక్ ఫర్ ఫ్రీడమ్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. మానవ అక్రమ రవాణా పై ప్రజలను చైతన్యం చేసే దిశగా విద్యార్థులతో కలిసి పట్టణం లో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు . మహిళలు, పురుషులు, చిన్న పిల్లలు అక్రమ రవాణా జరిగినట్లు గుర్తించిన వారు హెల్ప్ లైన్ నెంబర్ 1098-181100 కు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ సిఐ చాంద్ బాషా, పట్టణ ప్రముఖులు పలువురు పాల్గొన్నారు.

జానం గంగిరెడ్డికి గౌరవ డాక్టరేట్

విశాలాంధ్ర- పీలేరు : అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి ఉత్సవాలు హైదరాబాదు, హిమాయత్ నగర్ లోని అలైడ్ ఆర్టిస్ట్ ఆడిటోరియం లో శుక్రవారం ఫ్రెండ్షిప్ మినిస్ట్రీస్, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో పలువురు రచయితలు, గాయకులు, కళాకారులు, సాంఘిక సేవకులకు గౌరవ డాక్టరేట్ అవార్డులు బహూకరించడం జరిగింది. అలాగే ఇందిరా ఆర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు సినీ అవార్డులు బహుకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్షిప్ మినిస్ట్రీస్ మరియు ఇందిరా ఆర్ట్స్ ఫౌండేషన్ నిర్వాహకులు, రెండు తెలుగు రాష్ట్రాల నుండి నృత్య కళాకారులు, గాయని గాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల మృత దేహాలకు పూర్తయిన పోస్టుమార్టం

మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపిన ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

విశాలాంధ్ర-మదనపల్లె : విద్యార్థుల మృతదేహాలకు శనివారం మదనపల్లె సర్వజన బోధనాస్పత్రిలో పోస్టుమార్టం పూర్తి అయ్యింది. తంబళ్లపల్లె మండలం, చెట్లవారిపల్లెకు చెందిన వెంకటరెడ్డి కొడుకు యశ్వంత్ రెడ్డి(19), అలాగే అదే మండలం మలిగివారిపల్లె కు చెందిన సుబ్బారెడ్డి కొడుకు అజయ్ కుమార్ రెడ్డి(19) లు శుక్రవారం కురబలకోట మండలం దాదంవారిపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంగతి తెలిసిందే. తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారనాథరెడ్డి మదనపల్లె సర్వజన బోధనాస్పత్రికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. సంతాపాన్ని తెలియజేశారు. జరిగిన ఘటన దురదృష్టకరమని, బాధితుల కుటుంబాలకు తాను అండగా ఉంటానని వారికి భరోసా ఇచ్చారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఎమ్మెల్యే వెంట వైసిపి నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు ఉన్నారు.

జాతీయ లోక్ అదాలత్ జయప్రదం చేయండి

11వ అదనపు జిల్లా జడ్జి.ఏ.మహేష్.

విశాలాంధ్ర- పీలేరు : జాతీయ లోక్ అదాలత్ జయప్రదం చేయాలని 11వ అదనపు జిల్లా జడ్జి.ఏ.మహేష్. తెలిపారు. ఈ సందర్భంగా పదకొండవ అదనపు జిల్లా కోర్టు నందు పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించడం జరిగినది. క్రిమినల్ కేసులు కుటుంబ తగాదాల కేసులు, చెక్ బౌన్స్ కేసులు, మెయింటెనెన్స్ కేసులు, సివిల్ కేసులు, యాక్ట్ కేసులు మొదలైనవి డిసెంబర్ 14న జరిగే జాతీయ లోక్ అదాలత్ లో పరిష్కరించుకోవచ్చునని ఎన్నో సంవత్సరాల పెట్టి పెండింగ్లో ఉన్న కేసులను త్వరిత గతిన పరిష్కార దిశగా తీసుకెళ్లాలని పోలీసు అధికారులకు తెలియజేశారు. ఇప్పటినుండి ఏ ఏ కేసులు లోక్ అదాలత్ లో పరిష్కారం అవుతాయో వాటిని ఖచ్చిదారులకి పిలిపించి కేసులను సెటిల్మెంట్ చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె . రవి, పీలేరు, కె.వి పల్లి, రొంపిచర్ల, బాకరాపేట, ఎర్ర వారి పాలెం, సదుం, ఎస్సైలు, పీలేరు ఎక్సైజ్ ఎస్సై, కోర్ట్ కానిస్టేబుల్స్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న విద్యార్థినికి పరామర్శ

విశాలాంధ్ర -కడప : కడప జిల్లా బద్వేల్ గోపవరం మండలం చెంచురి ప్రైవుడ్ సమీపంలోని ఫారెస్ట్ ప్రాంతంలో విద్యార్థినికి నిప్పంటించిన ఘటనకు సంబంధించిన బాలికను జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ మరియు మహిళా సాధికారిత అధికారి శ్రీలక్ష్మీ పరామర్శించారు. ప్రభుత్వం తరఫున బాలికకు న్యాయ సహాయం మరియు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని, రిమ్స్‌లో ఉన్న వన్ స్టాప్ సెంటర్ ద్వారా సేవలు అందిస్తామని తెలియజేశారు. రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవితో మాట్లాడి బాలికకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. స్థానిక బద్వేల్ సీడీపీఓ,జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-సుండుపల్లి :మండలం ఆరోగ్యపురంలో వెలిసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి అర్చకులు అమ్మ నాయక్ అభిషేకాలు,ప్రతేక పూజలు చేశారు,పూల అలంకరణ అనంతరం స్వామి వారికి నైవేద్యంతోపాటు,వచ్చిన భక్తులు తలనీల సమర్పించుకున్నారు భక్తులందరికీ తీర్థప్రసాదాలు ఇవ్వడం జరిగింది.

వాలంటీర్ల ఆందోళనకు సంఘీభావం

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ

విశాలాంధ్ర-మదనపల్లె: రాష్ట్రవ్యాప్తంగా రెండు లక్షల 60 వేల మంది వాలంటీర్లను కొనసాగించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద వాలంటీర్లు చేపడుతున్న ఆందోళనకు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ సంపూర్ణ సంఘీభావం తెలిపారు. శనివారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఏఐటీయూసీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని రెండు లక్షల 60 వేల మంది వాలంటీర్లందరిని కొనసాగిస్తామని, 10 వేలు వేతనం వాలంటీర్లు అందరికీ ఇస్తామని హామీ ఇచ్చి నేడు అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తుందని, ఇప్పటికీ వాలంటీర్ల బకాయి వేతనాలు కానీ, కొనసాగింపుపై స్పష్టతగానీ, పెంచుతానన్న వేతనంపై క్లారిటీ ఇవ్వటం లేదని ఆరోపించారు. తక్షణం కూటమి నాయకులు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో వాలంటీర్లు రోడ్డు మీదకు వచ్చి పోరాడడం మినహా మరొక దారి లేదని తెలిపారు. నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉన్న పరిస్థితుల్లో వాలంటీరు ఉద్యోగమే ప్రధాన ఆదాయ వనరుగా కుటుంబాన్ని పోషించుకుంటున్నారని తెలిపారు. కరోనా సమయంలో ప్రజలకు ప్రాణాలకు తెగించి పనిచేసినా ఉద్యోగ భద్రత లేకపోవడం తీవ్ర నిరాశకు గురిచేస్తుందని, వాలంటీర్ల చేత బలవంతంగా రాజీనామా చేయించిన వాళ్లపై కఠిన చర్యలు తీసుకోని, రాజీనామాలు చేసిన వారిని తిరిగి విధులలోకి తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మదనపల్లి పట్టణ కార్యదర్శి తిరుమల, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు మురళి, వెంకటరమణ ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు రవి, తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న

మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు గవర్నమెంట్ హాస్పిటల్ మార్చురీ నందు పులిచెర్ల సుజాత(36) అనే మహిళ ప్రమాదవశాత్తు రైలు ప్రమాదంలో మరణించగా అంతిమ సంస్కరణలు చేయడానికి బంధువులు ఎవరు ముందుకు రాకపోవడంతో మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్ చైర్మన్ మోరె లక్ష్మణ్ రావును సంప్రదించగా వారు వెంటనే స్పందించి శనివారం సాయంత్రం హిందూ స్మశాన వాటికలో హిందూ సంప్రదాయం ప్రకారంగా అంతిమ సంస్కరణలు నిర్వహించారు. ఇటువంటి గొప్ప కార్యక్రమానికి చేయూత అందించిన ఫౌండేషన్ చైర్మెన్ మోరె లక్ష్మణ్ రావు, సుభహాన్(ఫౌండేషన్ టౌన్ ప్రెసిడెంట్), అహమద్ హుస్సేన్, కృపా అగ్ని షరూన్ ట్రస్ట్ సభ్యులు సుమన్ బాబు, సురేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. మా శ్రీ అమ్మ శరణాలయంలోని వృద్ధులకు సహాయం చేయదలచిన ఎవరైనా దాతలు ఉంటే 82972 53484, 91822 44150 అనే నంబర్లకు సంప్రదించాలని కోరారు.

మహాయజ్ఞంలా మొక్కలు నాటాలి: ఎమ్మెల్యే

పచ్చదనం - చల్లదనం కార్యక్రమంలో ఎమ్మెల్యే

విశాలాంధ్ర-మదనపల్లె : పట్టణంలో మహా యజ్ఞంలా మొక్కలు నాటాలని మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా వెల్లడించారు. శనివారం స్థానిక శేష్ మహల్ థియేటర్ సమీపంలో మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పచ్చదనం - చల్లదనం కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇందులో భాగంగా మొక్కలు నాటి వాటికి నీరు పోశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం కాలుష్యం అమాంతం పెరిగిపోయి వాతావరణం కలుషితం ఎక్కువైపోయిందన్నారు. ఈ నేపథ్యంలో కాలుష్యాన్ని నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ చూపుతున్నాయన్నారు. మదనపల్లి పట్టణ ప్రజలు ప్రతీ వారం మొక్కలు నాటాలని పిలుపునివ్వడం తో ఇప్పటికే అధిక సంఖ్యలో మొక్కలు నాటడం జరిగిందన్నారు. మొత్తం పదివేల మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నామని త్వరలోనే లక్ష్యాన్ని అధిగ మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ చాంద్ బాషా, టిడిపి నాయకులు నవీన్ చౌదరి, పూలకుంట్ల హరిబాబు, శ్రీనివాసులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను

పరిశీలించిన మున్సిపల్ కమీషనర్

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు పురపాలక సంఘం పరిధిలోని మోడంపల్లి ప్రాంతంలో నీరు నిల్వ ఉన్న ప్రాంతమును మున్సిపల్ కమీషనర్ మల్లికార్జున శనివారం నాడు పరిశీలించి అక్కడ జేసీబీ ద్వారా నీరును తొలగించి అక్కడ శాశ్వత పరిష్కారం కొరకు ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. అదేవిధంగా స్థానిక గోపి రైస్ మిల్ ప్రాంతములో నీరు నిల్వ ఉన్న ప్రాంతానికి వెళ్లి శుభ్రం చేయించారు. అనంతరం బ్రహ్మసాధు మఠం ప్రాంతంలో పర్యటించి అక్కడ కాలువలు లేని ప్రాంతంలో వెంటనే అంచనాలు తయారు చేయవలసిందిగా సంబంధిత ఇంజనీరింగ్ విభాగము వారికి ఆదేశించారు. కుమ్మరి కొట్టాల నందు నీరు రాత్రి సమయంలో సరిగా రాలేదని ప్రజలు తెలుపగా సంబంధిత ఇంజనీరింగ్ విభాగము వారికి సమయము వేళలు మార్పు చేయాలని మున్సిపల్ కమీషనర్ ఆదేశించారు.

హత్య జరిగి ఆరు నెలలైనా నేరస్తులను అరెస్ట్ చేయరా..!

శ్రీనివాస్ హత్య కేసులో నిందితులు అరెస్టు చేయకపోతే ఆందోళన తప్పదు
చిన్న పుల్లా రెడ్డి, నాగ పుల్లారెడ్డిల పై పోలీసులకు ప్రేమ ఎందుకు ...?
సాక్షులను భయపడితే సహించేది లేదు.. న్యాయం చేయకపోగా బెదిరింపులా...
సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర సూటి ప్రశ్న

విశాలాంధ్ర-కడప రూరల్ : కడప జిల్లా పెండ్లిమర్రి మండలం యాదవాపురం చెందిన ఆదిమూలం శ్రీనివాసు హత్య కేసులో ప్రధాన నిందితులు నాగ పుల్లా రెడ్డి, చిన్న పుల్లారెడ్డి అరెస్టు చేయకుండా పోలీసులు నిందితులపై ప్రేమ చూపటం సరి కాదని వెంటనే అరెస్టు చేయకపోతే ఆందోళన తప్పదని సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర హెచ్చరించారు.శనివారం ప్రెస్క్లబ్లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ చెందిన భూ కబ్జా దారులు ఏప్రిల్ 2వ తేదీన ఆదిమూలం శ్రీనివాసులు ను అత్యంత కిరాతకంగా హత్య చేసి చంపేశారు. భూ వివాదం పరిష్కారం చేయాలని గత ప్రభుత్వంలో అనేకసార్లు పోలీసులకు, రెవెన్యూ అధికారులకు పిర్యాదు చేసినా పోలీసులు రెవెన్యూ అధికారులు కబ్జాదారులకు కొమ్ము కాస్తూ వచ్చి చివరికి అధికారులు, ప్రభుత్వ నిర్లక్ష్యం వలన ఒక ప్రాణం పోయిందని ఆవేదం వ్యక్తం చేశారు. హత్య జరిగి ఆరు నెలలు అవుతున్నా ప్రధాన నిందితులను ఇంకా అరెస్టు చేయకుండా పోలీసులు నేరస్తులపై ప్రేమ చూపిస్తున్నారన్నారు గతంలో పెండ్లి మర్రి ఎస్ఐగా పనిచేసిన సునీల్ కుమార్ రెడ్డి హత్య కేసును ప్రమాదంగా మార్చే ప్రయత్నం చేస్తే సస్పెండ్ అయ్యారని గుర్తు చేశారు గతంలోని సిఐ, డీఎస్పీ కేసును నీరుగార్చే ప్రయత్నం చేశారని వీటిపై ఆందోళన చేస్తే అదనపు ఎస్పి వెంకట రాముడు నేతృత్వంలో ప్రత్యేక విచారణ బృందం (సిట్) వేశారన్నారు.సిట్ విచారణ చేపట్టి ఏం చేసిందో ఇప్పటికి తెలియదన్నారు ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు నేరస్తులతో చేతులు కలపటం కాదన్నారు. ప్రజలకు సమస్యలు వస్తే పోలీసుల దగ్గరికి వస్తారు అటువంటిది పోలీసులు రక్షణ కల్పించకపోతే పోలీసు వ్యవస్థపై నమ్మకం సన్నగిల్లుతుందన్నారు. భాదితులు భూమి వివాదం పరిష్కారం చేయాలని హత్య కేసులో ప్రధాన నిందితులు నాగ పుల్లారెడ్డి, చిన్న పుల్లా రెడ్డిలను అరెస్ట్ చేసి మాకు ప్రాణ రక్షణ కల్పించాలని పోలీసు అధికారులకు రెవెన్యూ అధికారులకు అనేకసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు పోయినా పోలీసులు అరెస్టు చేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు.మరో వైపు నేరస్తులు బాధితులను, సాక్షులను, బంధువులను, గ్రామస్తులను చంపేస్తామని బెదిరిస్తున్నా రని తెలిపారు. హత్య కేసులో ప్రధాన నిందితులను అరెస్టు చేయకుండా వారిపై పోలీసులకు ప్రేమ ఎందుకు ఉందో చెప్పాలన్నారు ముఖ్యమంత్రి కార్యాలయం నుండి ఫిర్యాదులు వచ్చిన పోలీసు ఉన్నత అధికారుల నుండి ఆదేశాలు వచ్చిన పెండ్లి మరి పోలీసులు నిందితులను అరెస్టు చేయకుండా కాలయాపన చేయటానికి అంత్యర్యం ఏమిటో పోలీసులు సమాధానం చెప్పాలన్నారు. ప్రధాన నిందితులను నాగ పుల్లారెడ్డి చిన్న పుల్లారెడ్డిలను వెంటనే అరెస్టు చేయకపోతే అన్ని ప్రజాసంఘాలను కలుపుకొని రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె సి బాదుల్ల, వి గంగా సురేష్, బాధితులు ఆదిమూలం చిన్న సుబ్బరాయుడు, వెంకటేష్లు పాల్గొన్నారు.

23న ఛలో యోగి వేమన విశ్వవిద్యాలయం

విశాలాంధ్ర-కడప రూరల్ : యోగివేమన విశ్వవిద్యా లయంలో విలేకరుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి, జి వలరాజు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి గంగా సురేష్ మాట్లాడుతూ యోగి వేమన యూనివర్సిటీ లో అవినీతి అక్రమాలు, లైంగిక వేధింపులు ఉన్న ఇంచార్జీ వీసీ కృష్ట రెడ్డి నైతికంగా రాజీనామా చేయాలి, అవినీతి అక్రమాలతో లైంగికంగా వేధింపులు ఉన్నా వారిని వీసీగా నియమించడం సరైనది కాదు, కృష్ణ యూనివర్సిటీలో రిజిస్టర్గా పనిచేస్తున్న సందర్భంగా అక్రమంగా రోస్టర్ పాయింట్ లేకుండా నియమించుకోవడం, లైంగిక వేధింపులకు పాల్పడడం, ఏసీబీ ఎంక్వయిరీ జరగడం తిరిగి యోగీ వేమన యూనివర్సిటీకి వచ్చి ప్రిన్సిపాల్గా తన బాధ్యతను చేపట్టి లైంగిక వేధింపుల కారణంగా సస్పెండ్ అయినా కే కృష్ణారెడ్డి నీ ఉన్నత అధికారులు ఏ విలువలతో నియమిచారో సమాధానం చెప్పాలి అని రిజిష్టర్ నైతికంగా రాజీనామ చేసిన పదవుల కోసం వీసీ కె.కృష్ణారెడ్డి పదవిలో కొనసాగడం సరైనది కాదని వెంటనే రాజీనామ చేయాలి, అదే విధంగా అవినీతి అక్రమాలు అక్రమ నియామకాల పై చర్యలు తీసుకొవాలి, 23న చలో యోగి వేమన యూనివర్సిటీ ముట్టడి చేపడుతున్నాం అని తెలిపారు. ఈ కార్యక్రమ ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె శివశంకర్, నాయకులు శివ చంద్ర పాల్గొన్నారు.

యువత వ్యాపారరంగంలో రాణించాలి:యల్లటూరు శ్రీనివాస రాజు

విశాలాంధ్ర-రాజంపేట:ఉమ్మడి కడప జిల్లా రాజంపేట భువనగిరిపల్లె కు చెందిన జనసేన నాయకులు పూల మురళి నూతన మీనాక్షి ట్రేడర్స్ (సిమెంట్ దుకాణం) రాజంపేట బైపాస్లో ప్రారంభించారు. శనివారం మురళి ఆహ్వానం మేరకు రాజంపేట పార్లమెంటు జనసేన నేత యల్లటూరు శ్రీనివాస రాజు వెళ్లి దుకాణాన్ని సందర్శించి మురళిని ఆశీర్వదించి వ్యాపారం దినదినాభివృద్ధి జరగాలని ఆకాంక్షించారు. యువత వ్యాపార రంగాలలో ముందుండి ఆర్థికంగా బలపడాలని తన వంతు సహకారం ఎప్పుడూ వుంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు పూల మురళి,కోలాటం హరికృష్ణ, చింతల శివ, కిరణ్ పాల్గొన్నారు.

అవగాహన సహాయక పద్ధతులతో డైస్లెక్సియాను అధికమించవచ్చు

ఎంఈఓ-2 వేల్పుల శ్రీనువాసులు వెల్లడి

విశాలాంధ్ర-గాలివీడు:అవగాహన పెంచడ, సహాయక పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా డైస్లెక్సియాను అధిగమించి విద్యార్థుల్లో సమర్థవంతమైన కమ్యూనికేషన్ నైపుణ్యాలను అభివృద్ధి చెయ్యవచ్చని ఎంఈఓ-2 వేల్పుల శ్రీనువాసులు అన్నారు. శనివారం మండలకేంద్రంలోని స్థానిక భవిత కేంద్రంలో సమగ్రశిక్ష రాష్ట్ర సంచాలకుల ఆదేశాల మేరకు డైస్లెక్సియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగాఆయన మాట్లాడుతూ డైస్లెక్సియా అనేది పఠనం మరియు ఇతర భాషా ఆధారిత అభిజ్ఞా నైపుణ్యాలను ప్రభావితం చేసే అభ్యాస రుగ్మత అన్నారు.దీనిని అధికమించడానికి బహుళ ఇంద్రియాలను నిమగ్నం చేసే మల్టీ సెన్సరీ పద్ధతులు,ఆడియో బుక్స్ వంటి సాంకేతిక సహాయాలతో అధిగమించవచ్చన్నారు.అంతేగాక అధ్యాపకులు, తల్లిదండ్రులు మరియు కౌన్సెలింగ్ నిపుణులు సహాయక పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా అభ్యాస వైకల్యాలు ఉన్న వ్యక్తులు వారి పూర్తి సామర్థ్యాన్ని సాధించడంలో సహాయపడుతుందన్నారు.ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటచలపతి,ఐఈఆర్పీ వి.కలందర్,కృష్ణవేణి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అభ్యసన సమస్యల పిల్లకు అవగాహన కోసం విద్యార్థుల ర్యాలీ

విశాలంధ్ర- సంబేపల్లి : భవిత కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక ఎంపీపీఎస్ సంబేపల్లి పాఠశాలలో డిస్లెక్షియా పై అవగాహన కల్పించేందుకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంబేపల్లి మండలం విద్యాశాఖ అధికారి రమాదేవి మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులు ఎవరైతే ఉన్నారో వారిలో అభ్యసనకు సంబంధించిన లోపాలు ఉంటాయని ఆ వైకల్యాలను ప్రత్యేక శిక్షణ ద్వారా సరిదిద్దవచ్చు అని తెలిపారు.అభ్యసన సమస్యలు కలిగిన పిల్లలను గుర్తించి వారికి తగిన విధంగా తీర్చిదిద్దాలన్నారు ఉపాధ్యాయుల ద్వారా తరగతి గదిలో పిల్లల సమస్యలను అభ్యసనా సమస్యలను కనుగొని వారికి తగిన శిక్షణ అందించాలని సూచించారు ఉపాధ్యాయుల ద్వారా తరగతి గదిలో అభ్యసన సమస్యలు కలిగిన పిల్లలకు తగిన శిక్షణ అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రమాదేవి, ఎంపీపీ స్కూల్ హెచ్ఎం నాగేశ్వరరావు నాయక్, టీచర్ జయమ్మ, ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయులు రవిచంద్ర ప్రసాద్ హరిత సుజాత ప్రత్యేక అవసరాలు గల పిల్లలు, వారి తల్లిదండ్రులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

తెలుగు భాష అమలుకు వినతి :డా.తవ్వా వెంకటయ్య

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలో తెలుగు భాష అమలు తీరు ఐదు శాతం కూడా లేదని విశ్వవిద్యాల ఉపకులపతి చొరవ తీసుకొని అంతర్గత పరిపాలన వ్యవహారాల్లోనూ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల్లోనూ తెలుగు భాష అమలు చేయాలని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కే.కృష్ణారెడ్డికి ,యోగి విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు, వైయస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డికి ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం పూర్వ సభ్యులు డా.తవ్వా వెంకటయ్య విన్నవించారు. యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలో తెలుగు భాష అమలు జరపాలని అలాగే విశ్వవిద్యాలయ పరిధిలో ఉన్న అనుబంధ కళాశాలలో ప్రతినెల ఒక సాహితీ కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించేలా విశ్వవిద్యాలయ ఉపకులపతి అనుబంధ కళాశాలలకు ఆదేశాలు జారీ చేయాలని డా.తవ్వా వెంకటయ్య కోరారు.ఈ సందర్భంగా ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయ పరిధిలో

తెలుగుభాష అమలు కోసం పాలక మండల సభ్యులుగా తాను చొరవ తీసుకుంటానని వెల్లడించారు. ఉపకులపతి ఆచార్య కే కృష్ణారెడ్డి మాట్లాడుతూ దీనిని వీలైనంత త్వరగా అమలు జరిపి తెలుగు భాష అమలకు కృషి చేస్తానన్నారు. తమ విశ్వవిద్యాలయ పరిధిలో ఉన్న అనుబంధ కళాశాలకు తక్షణమే ఆదేశాలు జారీచేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా డా.తవ్వా వెంకటయ్య పాలక మండలి సభ్యులకు, ఉపకులపతికి కృతజ్ఞతలు తెలియజేశారు.

స్కూల్ దగ్గర మద్యం షాపు తొలగించాలి :సిపిఐ, మహిళా సమాఖ్య

విశాలాంధ్ర - రైల్వేకోడూరు: నియోజకవర్గం పుల్లంపేట మండల కేంద్రంలోని స్కూల్ సమీపంలో ఏర్పాటు చేసిన లక్కీ మద్యం షాపును వెంటనే తొలగించాలని ఎపి మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు నంద్యాల సరోజమ్మ,సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పుల్లంపేట సిపిఐ మండల కార్యదర్శి సెల్వం కుమార్ అద్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమించి ఎస్ బివిడి సభా హైస్కూల్ దగ్గర మద్యం షాపు ఏర్పాటు చేయడం వలన విద్యార్ధిని విద్యార్థులకు మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు.ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి ఏర్పాటు చేసిన మద్యం షాపును తొలగించాలని ఎక్సైజ్ శాఖ అదికారులను డిమాండ్ చేశారు. మద్యం షాపు తొలగించని సమక్షంలో అన్నమయ్య జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమీషనర్, సూపరింటెండెంట్ దృష్టికి తీసుకుపోయి వివరించి తరువాత పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వ యంత్రాంగాన్ని హెచ్చరించారు. రెవిన్యూ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కిరణ్ కు వినతిపత్రం అందజేసి నిరసన కార్యక్రమాన్ని విరమించారు. నిరసన కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి శెట్టిపల్లి పెంచలయ్య, మహిళా సమాఖ్య మండల కార్యదర్శి దుర్గ తదితరులు పాల్గొన్నారు.